
భారత శక్తి®
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal


12లో

మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు: షర్మిల


సంపుటి - 20 | సంచిక - 55 | హైదరాబాద్ | మంగళవారం 12-08-2025 | పేజీలు : 12 | వెల : 1.00

## నేటి భారతం...

* జీవించడానికి పోరాడే వారు కొందరు..
* పోరాటాల కోసమే జీవించేవారు మరికొందరు..
* జీవితంలో నటించేవారు కొందరు..
* అసలు నటిసూనే జీవించేవారు ఎందరో..?
* నటించినా.. జీవించినా.. పోరాటాలు సాగించినా..
* ఆ జీవితాలు మనవే కదా..?
* వాటి ఫలితాలు అనుభవించాల్సింది కూడా మనమే కదా..?
* అందుకే పెద్దలు అంటారు మీరు ఎలా ఉంటారో
* మీకు ఎదురైయ్యే ఫలితాలు కూడా అలాగే ఉంటాయి..
* మంచిని కోరుకుంటే మంచి ఎదురవుతుంది..
* చెడ్డ పనులు చేస్తే చెడు మాత్రమే మీకు లభిస్తుంది..
* పోరాటాలు చేయడం మంచిదే..
* కానీ మీ పోరాటం దేనికోసం..? ఎవరికోసం..?
* అనేది ఆలోచించి చేయాలి.. అప్పుడే విజయం మీకు లభిస్తుంది..

– బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్

## హైదరాబాద్‌లో..
# భారీ వర్షాలు కురిస్తే నరకయాతన..



- కాలనీలకు కాలనీలు మునిగిపోతున్నాయి...
- దీనికి పరిష్కారం అనేది లేదా..?
- కాంక్రీట్ జంగిల్ గా మారిపోయిన మహానగరం..
- నాలాల ఆక్రమణ, అధికారుల నిర్లక్ష్యం..
- భవిష్యత్ తరాల వారిని అంధకారంలో ముంచేస్తున్న వైనం..
- వర్షం వచ్చిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..
- ప్రస్తుతం విభిన్న వాతావరణం నెలకొంది..

12లో


12లో

## కొండా సురేఖ ఇంటి ముందు ఉద్రిక్తత..

- హన్మకొండలో సురేఖ ఇంటి ముందు మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన
- మధ్యాహ్న భోజనన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని డిమాండ్
- సురేఖ ఇంట్లోకి చొరబడేందుకు యత్నం

## టాలీవుడ్‌లో ఆగిన సినిమా
# షూటింగులు..

**ప్రభుత్వానికి చేరిన వివాదం**


12లో

- వేతనాల పెంపు డిమాండ్‌తో సినీ కార్మికుల సమ్మె
- నిలిచిపోయిన తెలుగు సినిమా షూటింగులు
- రంగంలోకి దిగిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- చర్చల ద్వారా సహేతుకమైన పరిష్కారం కనుగొనాలని మంత్రి సూచన
- 30 శాతం పెంపు చిన్న సినిమాలకు భారమంటున్న నిర్మాతలు



## రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు
- 2019 అక్టోబర్ లో సూర్యాపేట జిల్లాలో రేవంత్ పై కేసు నమోదు
- కేసును కొట్టివేస్తూ తీర్పును వెలువరించిన హైకోర్టు


హైదరాబాద్, ఆగస్టు 11 (భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2019 అక్టోబర్

తరువాయి 12లో


12లో

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు
# గ్రీన్ సిగ్నల్..

- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష



## అసిమ్ మునీర్ అణు వ్యాఖ్యలపై
# భారత్ ఘాటు స్పందన..

- అది వారికి పరిపాటేనని కౌంటర్
- అమెరికా గడ్డపై నుంచి భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ అణు హెచ్చరికలు
- మాతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామన్న అసిమ్ మునీర్
- పాక్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భారత విదేశాంగ శాఖ
- ఇది పాకిస్తాన్‌కు పరిపాటేనని, బాధ్యతారహిత చర్య అని వ్యాఖ్య
- ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని

12లో

## పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు..
# 300 మంది ప్రతిపక్ష ఎంపీల మార్చ్!

**నిరసన మార్చ్‌కు అనుమతి కోరలేదన్న పోలీసులు**



- 'ఓట్ చోరీ', బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై నిరసన తెలియజేయడమే మార్చ్ ప్రధాన ఉద్దేశం
- 'ఆప్' కూడా మార్చ్‌లో పాల్గొనే అవకాశం

12లో

భారత శక్తి®

# ఈసీ వర్సెస్ రాహుల్ గాంధీ

దాల్ మే కాలా అని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వ్యవహా ర శైలిని, పనితీరును కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తప్పుబడుతున్నారు. భారతీయ జనతా పార్టీకి లబ్ధి చేకూరే విధంగా గత కొద్ది సంవత్సరాలుగా ఈసీఐ ఎన్నికల నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నదని రాహుల్ ఆరోపణ. గత లోక్‌సభ, మహారాష్ట్ర, హర్యా నా అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాహుల్ తరచుగా ఈసీఐని వేలెత్తి చూపుతున్నారు.కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేస్తూ కర్నాటకలో ఓట్ల చోరీపై చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే రాహుల్ గాంధీ ఆరోపణలపై మండిపడుతున్న ఎన్నికల సంఘం.. ఆయన్ను తన ఆరోపణలపై ప్రమాణం చేసి వివరాలు ఇవ్వాలని, లేదంటే దేశానికి క్షమాపణలు చెప్పాలంటూ ఉరుముతోంది. అయితే రాహుల్ స్పందించకపోవడంతో తానే స్వయంగా ఫ్యాక్ట్ చేసి వివరాలను విడుదల చేస్తోంది. ఇదే క్రమంలో రాహుల్ గాంధీ తాజాగా చేసిన ఓట్ల చోరీ ఆరోపణల్లో ఒకటైన బెంగళూరు వృద్ధురాలి ఓట్ల నమోదుపై ఇవాళ ఈసీ ఫ్యాక్ట్ చెక్ విడుదల చేసింది. శకునా రాణి అనే 70 ఏళ్ల మహిళ తొలిసారి ఓటు నమోదు చేసుకుందని, ఫామ్ 6ను దుర్వినియోగం చేసి ఒకే నెలలో రెండు ఓట్లు నమోదు చేయించుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. రాహుల్ ఆరోపణల్ని తోసిపుచ్చింది. తమ విచారణలో శకున్ రాణి రాహుల్ గాంధీ చెప్పినట్లు రెండుసార్లు కాదు, ఒక్కసారి మాత్రమే ఓటు వేసిందని తేలినట్లు ఈసీ పేర్కొంది. బెంగళూరులో ప్రజెంటేషన్ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. శకున్ రాణి ఓటరు గుర్తింపు కార్డును వాడి రెండు ఓట్లు వేశారని, పోలింగ్ బూత్ అధికారి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టిక్ మార్కులు ఉన్న పత్రాన్ని చూపించారని ఆరోపించారు. అయితే, ఎన్నికల కమిషన్ తన 5 పాయింట్ల సమాధానంలో రాహుల్ చూపించిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసింది కాదని తేల్చేసిందిఆయన ఆరోపణలతో ఎన్నికల నిర్వహణ తీరుపై దేశ ప్రజల కున్న విశ్వాసం ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం మహదేవపుర సెగ్మెంట్ ఎన్నికల జాబితాలో వున్న అవకతవకలను రాహుల్ రెండ్రోజుల క్రితం విలేకరులకు వివరించారు. 2024 ఎన్నికల్లో మిగతా సెగ్మెంట్ల కంటే మహదేవపురలో బీజేపీకి అనూహ్యంగా ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.ఒక గది ఉన్న ఇంటిలో పదుల సంఖ్యలో ఓటర్ల నమోదు, ఒకే ఓటరు పేరు పలుమార్లు నమోదు కావడం, ఓటర్ల ఫొటో లేకుండా, చిరునామా లేకుండా ఓటరు జాబితా తయారు చేయ డం డీకే ఓటరు పేరు పలు బూత్‌లలో దర్శనమీయడం వంటి అవకతవకల్ని రాహుల్ ఓటరు జాబితాను ముందుంచి ఎత్తిచూపారు. పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్ రాణి రెండుసార్లు ఓటు వేసినట్లు మీరు చెప్పారని ఈసీ గుర్తుచేసింది. అయితే తమ అధికారులు నిర్వహించిన ప్రాథమిక విచారణలో మీరు ప్రజెంటేషన్‌లో చూపించిన టిక్ మార్క్ చేసిన పత్రం పోలింగ్ అధికారి జారీ చేసిన పత్రం కాదని తేలినట్లు ఈసీ ఫ్యాక్ట్ చెక్ లో పేర్కొంది. దీనిపై రాహుల్ గాంధీకి సంబంధిత పత్రాలు ఇవ్వాలని నోటీసు పంపినట్లు ఈసీ తెలిపింది. వీటి ఆధారంగా శకున్ రాణి లేదా మరెవరైనా రెండుసార్లు ఓటు వేశారో లేదో సమగ్ర విచారణ చేపట్టవచ్చని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ తన పార్టీ డిజిటల్ ఓటరు జాబితా, ఓటింగ్ బూత్ సీసీటీవీ ఫుటేజ్ ను ఈసీ నుంచి కోరామని, కానీ వారు ఆ సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో తాము స్వంత దర్యాప్తు చేసామని, సమాచార హక్కు పిటిషన్లు దాఖలు చేసిన వివరాలు తీసుకున్నట్లు తెలిపారు. అందులో లభించిన ఆధారాలతో ఈసీ, బీజేపీ ఓట్లు దొంగిలించాయని ఆరోపించారు.మిగతా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిలో ఎన్నికల కమిషన్ బీజేపీకి ప్రయోజనం చేకూర్చిందని, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే విధంగా ఈసీఐ వ్యవహరించి తక్కువ మెజారిటీతోనైనా, బీజేపీ గట్టెక్కేలా చేసిందని రాహుల్ ఆరోపణ.ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో తప్పులు వెరసి, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చతెచ్చేలా ఈసీఐ వ్యవహరించిందనే తీవ్ర ఆరోపణను ఆయన ముందుకు తెచ్చారు. బీహార్‌లో ఈసీఐ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఇప్పటికే వివాదాస్పదమైన నేపథ్యంలో రాహుల్ చేసిన విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటింగ్ సమయం గడువుకు కొద్దిముందుగా ఓటర్లు బారులుతీరడం, అసలు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించడం బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకేనని రాహుల్ వాదన. దీనిపై తీవ్రంగా స్పందించిన ఈసీఐ, ఆధారాలలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. రాహుల్ చేసిన ఆరోపణల్లో పసలేదని ఈసీఐ బలంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నది.ఈసీఐ అడిగినట్టుగా అఫిడవిట్ దాఖలు చేసినా, దానిపై సంతకం చేసేందుకు రాహుల్ భయపడుతు న్నారని ఇప్పుడు ఈసీఐ పరోక్షంగా ఆ ఆరోపణలు తప్పుల తడక అని చెప్పే ప్రయత్నమూ చేస్తున్నది. రాజ్యాంగ సంస్థలపై దాడి చేయడం రాహుల్‌కు మామూలేనని, ఇదీ దానిలో భాగమేనని బీజేపీ మంత్రులు, నాయకులు వెనువెంటనే స్పందించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్టుగా, బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినట్లుగా రాహుల్ మాట్లాడుతుంటారని బీజేపీ నాయకులు కొట్టిపారేస్తున్నారు.

# నాలుగేళ్ల ముందే ఎన్నికల వ్యూహాలు

విజయవాడ, ఆగస్టు 1

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారా? అంటే అవుననే అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరగనున్నాయి. ప్రస్తుతమున్న 175 నియోజకవర్గాల నుంచి 225 నియోజకవర్గాలకు అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరగనుంది. అయితే ఈసారి ఎన్నికల్లో బలమైన నేతలను బరిలోకి దించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో మాదిరిగా తన ఫొటోను నమ్ముకుని ఎన్నికలకు వెళితే బొక్కా బోర్లాపడతామని ఆయన భావిస్తున్నారు. కేవలం అభ్యర్థుల ఎంపికతోనే విజయం సాధ్యమవుతుందని ఆయనకు సీనియర్ నేతలకు సూచనలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయన తన నిర్ణయాన్ని పునస్సమీక్షించుకోవడానికి రెడీ అయిపోయినట్లు వార్తలు వస్తున్నాయి.... ఎన్నికలు దగ్గర పడే సమయంలో ఇతర పార్టీల నుంచి నేతల రాక మొదలవుతుంది. సహజంగానే అధికార పార్టీపై ఉన్న అసంతృప్తి నేతలతో పాటు టిక్కెట్ దక్కదని భావించిన వారు కూడా వైసీపీ వైపు చూసే అవకాశాలు లేకపోలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ లేదా జనసేన, లేకుంటే వైసీపీ తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదు. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ అందులో చేరి ఎవరూ చేతులు కాల్చుకోవడానికి సిద్ధంగా ఉండరు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో దాదాపు మాయమయిపోయింది. నేతలు కొద్దో గొప్పో ఉన్నా పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఉన్న వారు కొందరయితే, కేంద్రంలో అధికారంలోకి వస్తే తమకు పదవులు వస్తాయని భావించే వారు మాత్రమే కొనసాగుతున్నారు... అందుకే టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి వచ్చే నేతలను వైసీపీ లో చేర్చుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. తన జిల్లాల పర్యటనలో స్థానికనాయకత్వానికి కూడా ఈ మేరకు సంకేతాలు అందచేస్తున్నారు. ఇటీవల జరిగిన పలు సమావేశాల్లోనూ నేతలకు కొత్త నేతలు, పార్టీకిఉపయోగపడే వారు, వారి చేరికతో బలం పెరుగుతుందని భావిస్తే ఖచ్చితంగా చేర్చుకునే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. అటువంటి నేతల జాబితాను తయారు చేయాలని కూడా ఇటీవల జరిగిన రాష్ట్ర యువజన విభాగం నేతలతో సమావేశమయిన జగన్ ఇదే రకమైన వ్యాఖ్యలు చేశారు. సామాజికవర్గ పరంగా బలమైన నేతలు వస్తే , చేర్చుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకూ పార్టీని వీడి వెళ్లిన నేతల విషయంలో మాత్రం జగన్ మనసు మారలేదని తెలిసింది. పార్టీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత కొందరు నేతలు పార్టీని వీడి వెళ్లారు. అనేక నియోజకవర్గాల్లో నేతలు తాను గతంలో ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ వారు కష్టకాలంలో వదిలేసివెళ్లిపోయారు. కొందరు సీనియర్ నేతలు మాత్రం వారిని కూడా చేర్చుకునే విషయంలో పునరాలోచించాలని సీనియర్ నేతలు కోరగా, అందుకు జగన్ పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది. పార్టీని వీడి వెళ్లినవారు ఎంత పెద్దవారైనా, బలవంతులైనా, తన బంధువులైనా సరే తిరిగి తన వద్దకు తీసుకు రావద్దని కూడా నేతలకు సూచించినట్లు తెలిసింది. అలా చేస్తే కార్యకర్తలకు తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# 30 ఏళ్ల తర్వాత పులివెందుల ఉపఎన్నిక

కడప ఆగస్టు 11,

వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని పులివెందుల గ్రామీణ, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికలు అసెంబ్లీని తలపిస్తున్నాయి. అధికార టీడీపీ , వైఎస్ఆర్సీపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో హైటెన్షన్ నెలకుంది. ఆగస్టు 12న పోలింగ్ జరగనుండగా.. ఆదివారం సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి తెరపడనుంది. దీంతో తెరవెనుక రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. గడచిన మూడు దశాబ్దాల్లో పులివెందుల జెడ్పీటీసీ సీటుకు ఒకసారి మాత్రమే ఎన్నికలు జరిగాయి. 1995, 2006, 2013, 2021లో ఎన్నిక ఏకగ్రీవమైంది. చివరిగా 2001లో మాత్రమే ఎన్నిక జరగడం గమనార్హం. ప్రస్తుతం జరుగుతోన్న ఎన్నికలతో ఏకగ్రీవాలకు తెరపడింది. ఈ స్థానం వైఎస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంతగడ్డ కావడంతో ఆ పార్టీకి సవాల్‌గా మారింది.పోలింగ్‌కు సమయం దగ్గరపడుతుండటంతో ప్రలోభాలకు తెరలేచింది. ఇరు పార్టీలూ బేరసారాలకు తెరతీసినట్టు తెలుస్తోంది. ఒక్కో ఓటుకు రూ.10 వేలు ఇవ్వడానికి సిద్ధమైనట్లు సమాచారం. పులివెందుల, ఒంటిమిట్ట సిట్టింగ్ స్థానాలు గతంలో వైఎస్ఆర్సీపీవే. అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ప్రచారాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. భారీ ఎత్తున భద్రతను ఏర్పాటుచేసి.. నిరంతరం డేగ కళ్లతో నిఘా ఉంచారు.ముఖ్యంగా పులివెందులలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. పులివెందుల మున్సిపాల్టీలో కలిసిన గ్రామాలు మినహా మిగతా ఐదు ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఉప-ఎన్నిక జరుగుతోంది. ఇక్కడ కూటమి అభ్యర్థిగా లతా రెడ్డి.. వైఎస్ఆర్సీపీ నుంచి తుమ్మల హేమంత్ రెడ్డి బరిలో ఉండగా.. 10,601 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక, ఒంటిమిట్టలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాల పరిధిలోని 24,606 మంది ఓటేయనున్నారు. ఈ ఉప-ఎన్నికలో పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వారి భద్రతపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు వారికి రక్షణ కల్పిస్తున్నారు.కాగా, అధికార పార్టీకి పోలీసులు, అధికారులు కొమ్ముకాస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. పోలింగ్ బూత్‌లను మార్చేశారని, గ్రామాల్లో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయలేదని ఆరోపణలు చేస్తోంది. దీనిపై ఆ పార్టీకి చెందిన నేతలు విజయవాడలో ఆందోళనకు దిగారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే, డీజీపీ కార్యాలయానికి కూడా వెళ్లి దీనిపై ఫిర్యాదు చేశారు.

పులివెందుల ఎన్నిక బాయ్ కాట్ చేస్తారా

వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈరోజు రేపట్లో పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశముందని తెలిసింది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఈ నెల 12వ తేదీన జరగనుంది. ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను ఇటు టీడీపీ, అటు వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కడప జిల్లాలో రెండు చోట్ల ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఒకటి పులివెందుల కాగా, మరొకటి ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నిక. పులివెందుల నియోజకవర్గం జగన్ సొంత నియోజకవర్గం కావడంతో అక్కడ పాగా వేయాలని టీడీపీ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అలాగే తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వైసీపీ కూడా అంతే స్థాయిలో శ్రమిస్తుంది. రెండు పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. పులివెందుల నుంచి వైసీపీ అభ్యర్థిగా దివంగత మహేశ్వర్ రెడ్డి కుమారుడు బరిలో ఉండగా, టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి పోటీలో ఉన్నారు. ప్రచారం ఇరు పార్టీలో జోరుగా కొనసాగిస్తున్నాయి. టీడీపీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. వైసీపీ నుంచి అవినాష్ రెడ్డి, సతీష్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు కూడా తమకు శక్తికి మించి గెలుపొందేందుకు పోరాడుతున్నారు. అయితే అధికార బలం ఉపయోగించి టీడీపీ తమపై అక్రమ కేసులు పెడుతుందని, తమ నాయకులను కొట్టి తమపైనే కేసులు పెడుతుందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.. కానీ అదే సమయంలో ఎన్నిక సజావుగా జరిగేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు తీసుకుంటుందని, అందులో ప్రభుత్వ జోక్యం ఉండదని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే అనేక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంపై వైసీపీ అభ్యంతరం తెలుపుతుంది. మొత్తం 10 వేలకు పైగా ఉన్న ఓటర్లలో దాదాపు చాలా ఓటర్లు నాలుగు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని తప్పుపడుతుంది. ఎన్నికల కమిషన్ ను కూడా కలిసింది. కేవలం రిగ్గింగ్ చేసుకోవడానికే ఇటువంటి చర్యలకు అధికార పార్టీ పాల్పడుతుందని వైసీపీ ఆరోపిస్తుంది. ఎన్నికల కమిషన్ ను కలిసినా అదే గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినా స్పందిచడం లేదని వైసీపీ నేతలు అంటున్నారు. పులివెందుల ఉప ఎన్నిక బరి నుంచి వైసీపీ తప్పుకుంటుందన్న ప్రచారం జరుగుతుంది. ఎన్నికలు జరగడానికి అంటే ఈ నెల 12వ తేదీన పోలింగ్ కావడంతో ముందుగానే ఎన్నికను బాయ్ కాట్ చేయాలన్న నిర్ణయానికి వైసీపీ నేతలు వచ్చినట్లు వైసీపీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఎందుకంటే సహజంగా అధికార పార్టీ అన్ని రకాలుగా తమపై ఆధిపత్యం ప్రదర్శించే అవకాశముంటుందని, పోలీసులు, ఎన్నికల అధికారులు అధికార పార్టీకే సహకరించే అవకాశాలున్న పరిస్థితుల్లో తాము ఎన్నిక నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పేందుకు వైసీపీ నేతలు సిద్ధమవుతున్నారు. అప్పుడు ఎన్నిక జరిగినా తాము పోటీ చేయలేదని చెప్పుకోవడానికి అవకాశం దక్కుతుందన్నది వారి ఆలోచన. జగన్ పరువు కూడా నిలబడుతుందని బాయ్ కాట్ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# యూరియా కోసం రైతుల అందోళన

కరీంనగర్

హుజూరాబాద్ నియోజకవర్గం లో యూరియా కోసం అన్నదాతలు ఆందోళనకు దిగారు. హుజూరాబాద్ సొసైటీ లో వేకువజాము నుండే భారీ క్యూ లైన్ కట్టారు. వీణవంక మండలం నర్సింగపూర్ లో రైతులు రోడ్డెక్కారు. జమ్మికుంట - కరీంనగర్ రహదారి పై ధర్నా రాస్తారోకో చేసారు. రైతులకు యూరియా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేసారు.

# యూరియా కోసం చెప్పుల లైను

రాజన్న సిరిసిల్ల జిల్లా

యూరియా కోసం చందుర్తిలో సహకార సంఘం వద్ద రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. వారం రోజులుగా తిరుగుతున్న పట్టించుకునే నాధుడు లేదని అంటున్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఒకవైపు అధికారులు ప్రకటనలు ఇస్తుంటే యూరియా కోసం రైతులు బారులు తీరడం సర్వత్రా ఆందోళన కలిగించింది. ఒకరికి ఒక బస్తా మాత్రమే ఇస్తుండడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. సొసైటీల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.,

============================

# స్కూలు వ్యాన్, కారు, బైకు ఢీ వ్యక్తికి తీవ్ర గాయాలు

మెదక్

హవేలీ ఘన్పూర్ మండలం షామ్నాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రామాయంపేట నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఓ ప్రవేట్ పాఠశాల బస్సు, ఎదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనం మూడు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. పాఠశాల బస్సు లో ఉన్న విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది.

# ఏనుగు దాడి చేసినా బతికిపోయాడు

కర్ణాటకలోని చామరాజనగర్లో ఉన్న బందీపూర్ టైగర్ రిజర్వ్ లో కేరళకు చెందిన ఓ పర్యాటకుడిపై ఏనుగు దాడి చేసింది. కెక్కనహల్లి వెళ్లేదారిలో రోడ్డు పక్కనే ఏనుగు ఉండటంతో వాహనదారులు అక్కడే ఆగిపోయారు. ఓ వ్యక్తి ముందుకు వెళ్తుండగా అతణ్ని ఏనుగు వెంటాడింది. పరిగెత్తుకుంటూ వెళ్లి కిందపడిపోవడంతో దాని కాళ్లకింద చిక్కుకుని చిన్న గాయాలతో తప్పించుకోగలిగాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# హుస్సేన్ సాగర్ కు భారీగా వరద

హైదరాబాద్‌హుస్సేన్ సాగర్ కు భారీగా వరద చేరింది. దాంతో సాగర్ నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్ కు వరద పోటెత్తింది. బంజారా , బల్కాపూర్, పికెట్ , కూకట్ పల్లి నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వరద వస్తుంది. హుస్సేన్ సాగర్ కు ఇన్ ఫ్లో 1027 క్యూసెక్కుల వరద. హుస్సెన్ సాగర్ ప్రస్తుత 513.50 మీటర్లు గా నీటి మట్టం వుంది. హుస్సెన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు . తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని మూసి లోకి వదులుతున్నారు.

# అమరావతిపైనే ఆశలు...

విజయవాడ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాత ఫార్ములతోనే ఈసారి కూడా ముందుకు వెళుతున్నారు. 2014 ఎన్నికల్లో ఏ ఫార్ములాతో అయితే వెళ్లారో అదే ఫార్ములాను ఈసారి కూడా ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. 2027 నాటికల్లా పోలవరం ప్రాజెక్టు నుంచి నీరు అందిస్తామని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీనికి మూడేళ్లు గడువు పెట్టారు. అంటే 2028వ సంవత్సరం నాటికి మొదటి దశ అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసే లక్ష్యాన్నిఅధికారులకు నిర్దేశించారు.అమరావతి రాజధాని నిర్మాణం మొదటి దశ నిర్మాణ పనులు పూర్తయితే కొంత హైప్ వస్తుందని భావిస్తున్నారు. భారీభవనాలతో పాటు అక్కడ అధికారుల నివాసాలకు సంబంధించిన పనులు కూడా పూర్తవుతాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటుందన్న భావన అధికార పార్టీ నేతల్లో ఉంది. అయితే రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టు పొందిన సంస్థలు భవన నిర్మాణ కార్మికులకుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఉపయోగించడం కొంత విమర్శలకు దారి తీస్తుంది. ఇక్కడ జరుగుతున్న పనుల్లో ఏపీకి చెందిన భవన నిర్మాణ కార్మికులను వినియోగించుకోవాలన్న డిమాండ్ వినపడుతుంది.పోలవరం ప్రాజెక్టు పనులు కూడా ప్రస్తుతం ఎనభై శాతం పూర్తయ్యాయయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. 2027 నాటికిపనులు పూర్తి చేసి ఖరీఫ్ సీజన్ కు సాగు నీరు అందించగలిగితే చాలా వరకూ ప్రభుత్వం సక్సెస్ అయినట్లే. ముఖ్యంగా రైతులు ప్రయోజనం పొంది కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడే అవకాశముందని అంటున్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టు సంస్థల యాజమాన్యాలకు కూడా హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయడమే కాకుండా రైతులకు సాగు నీరు అందించడంతో పాటుగా కొన్ని ప్రాంతాలకు తాగు నీటి సౌకర్యం కూడా కల్పించాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు అధికారుల వెంట పడుతున్నారు.కానీ భారీ వర్షాలకు రెండు పనులకు ఆటంకంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. రాజధాని అమరావతిలో ఇంకా వర్షపు నీటిని



తోడేందుకు మోటార్లను ముమ్మరంగా వినియోగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ పోటెత్తతుతున్న వరద పనులకు ఆటంకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అనుకున్న లక్ష్యానికి పోలవరం, అమరావతి పనులు పూర్తవుతాయా? లేదా? అన్న సందేహం కొంత అధికార పార్టీ నేతల్లో కనిపిస్తుంది. జమిలి ఎన్నికలు వస్తే ముందుగానే ఎన్నికలు వస్తే ఇక పనులు అసంపూర్తిగా నిలిచిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఈ ఫార్ములా అనుకూలంగా పనిచేస్తుందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# కేబినెట్ లోకి సోమిరెడ్డి...ప్రయత్నాలు

నెల్లూరు, ఆగస్టు 11,

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చంద్రబాబు కేబినెట్ లోకి చేరడానికి తహతహలాడుతున్నారు. అందుకే వైసీపీకి కౌంటర్ లు ఇవ్వడంలో ముందుంటారు. ఏ విషయంలోనైనా సోమిరెడ్డి ముందుంటున్నారు. వైసీపీ అధినేత జగన్ పై విమర్శలు చేయడంలో ప్రస్తుతం ఉన్న మంత్రుల కన్నా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెంటనే స్పందిస్తూ ఆయన టీడీపీ నాయకత్వం దృష్టిలో పడాలని ప్రయత్నిస్తున్నట్లు కనపడుతుంది. లోకేశ్ ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేయాలని కూడా సోమిరెడ్డి డిమాండ్ చేయడం వెనక మంత్రివర్గంలోకి ఛాన్స్ వస్తుందేమోనన్న ఆశ ఆయనలో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు. తన ప్రత్యర్థి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కూడా సుదీర్ఘకాలం జైలులో ఉంచి తన సత్తా చూపారు.వరసగా ఓడిపోయినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి పదవి ఖాయం. ఎందుకంటే సింహపురిలో ఆయనే పార్టీలోకింగ్. మరొకరు పోటీ లేరు. కానీ ఈసారి చాలా రోజుల తర్వాత సర్వేపల్లి నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. బలమైన వాయిస్.. సామాజికవర్గం అంతకు మించి పార్టీలో తొలి నుంచి ఉన్న వ్యక్తిగా ఆయనను ఎవరూ కాదనలేరు. అలాంటిది ఈసారి మాత్రం ఆయనకు అనేక రూపాల్లో మంత్రి పదవులకు ఇబ్బందులు కలిగాయి. నెల్లూరు జిల్లా నుంచి నారాయణ ఎన్నిక కావడంతో ఆయనకు ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాల్సి వచ్చింది. అదేసమయంలో పార్టీలో చేరిన ఆనం రామనారాయణరెడ్డికి కూడా మంత్రి పదవి దక్కడంతో సోమిరెడ్డిని



పక్కన పెట్టారు.వైసీపీ లోకి వచ్చే నేతల లిస్ట్ బయటకు రెండున్నరేళ్ల తర్వాత... కానీ రెండున్నరేళ్ల తర్వాత అయినా చంద్రబాబు మంత్రి వర్గ విస్తరణ తప్పదని అంటున్నారు. ఎందుకంటే ఇప్పుడున్నమంత్రుల పట్ల చంద్రబాబు అసంతృప్తిగానే ఉన్నారు. అయితే వెనువెంటనే మంత్రివర్గం నుంచి తప్పిస్తే ప్రభుత్వంపై తప్పుడు సంకేతాలువెళతాయని భావించి చంద్రబాబు రెండేళ్ల తర్వాత ఖచ్చితంగా మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు చేస్తారని అంటున్నారు. ఎన్నికల టీంను సిద్ధం చేసుకుంటారని అంటున్నారు. తొలిదఫా యువతకు ప్రాధాన్యత ఇచ్చినా రెండో విడతలో మాత్రం సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అందుకే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన వంతు ప్రయత్నంలో భాగంగా అందరికంటే వేగంగా స్పందిస్తున్నారంటున్నారు. మొత్తం మీద సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందన్నది చూడాల్సి ఉంది.

# చాన్స్ వస్తే చింతమనేని ప్రభాకర్ వదలరుగా

ఏలూరు, ఆగస్టు 11

చట్ట సభల్లో అతనో సీనియర్ సభ్యుడు. నియోజకవర్గానికి నాయకుడు. ప్రజలెన్నుకున్న పాలకుడు. ప్రభుత్వ వ్యవస్థల పనితీరుకు పర్యవేక్షకుడు. కానీ ప్రజా సమస్యల్లో మాత్రం అతనే తొలి సేవకుడు. ఆయనే దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.ప్రజలకు సమస్య ఉంటే వాటి పరిష్కారం కోసం తానే తొలి సేవకుడిగా మారతాననే విషయాన్ని మరోసారి నిరూపించుకున్నారు. ఉదయం జోరు వాన కురుస్తున్న సమయంలో దెందులూరు మండలం సోమవరపాడు వద్ద అటుగా ప్రయాణిస్తున్న చింతమనేని ప్రభాకర్ రోడ్ల మీద ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోయి ఉండటాన్ని గమనించారు. ఆ గుంతల కారణంమగా మోటారు బైక్ లు కార్లు లారీలు అస్తవ్యస్తంగా నిలిచిపోయి అక్కడ ట్రాఫిక్ ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడడం గమనించారు. వెంటనే తన కాన్వాయ్ నుంచి దిగిన చింతమనేని ప్రభాకర్ ఎవరూ రావాలని ఎదురు చూడకుండా తానే ఒక ట్రాఫిక్ పోలీస్ గా మారి రోడ్డుకు మధ్యలో నిలబడి ట్రాఫిక్ కానిస్టేబుల్ డ్యూటీ ప్రారంభించారు. ముందుగా భారీ వాహనాలను పక్కకు తప్పించి, ద్విచక్ర వాహనాలను ఒక వైపుగా పోనివ్వడం అదేవిధంగా ఎదురుగా వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తూ దాదాపు 20 నిమిషాల పాటు అక్కడ సమయాన్ని కేటాయించి ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ లాగా బాధ్యతలు నిర్వహించారు. పూర్తిగా ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. అదేవిధంగా ఇంతలా ప్రజలు ఇబ్బంది పడడానికి కారణమైన గుంతలను సైతం తన కార్యాలయ సిబ్బంది ద్వారా ఫోటోలు తీయించి వాటిని ప్రాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే అథారిటీస్ అధికారుల దృష్టికి తీసుకువెల్లి సత్వరమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే వాటిపై ప్రజలు ఫిర్యాదు చేసే



వరకు ఎదురు చూస్తూ కూర్చోకూడదని స్థానిక కూటమి నాయకులు గానీ నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులు సిబ్బంది గానీ వాటిని గుర్తిస్తే సత్వరమే వాటిని పరిష్కరించే విధంగా నాయకులు అధికారులు సిబ్బంది కూడా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అంతేతప్ప ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడు చూద్దామనేటువంటి నిర్లక్ష్య ధోరణిని కూడా ఎవరు పాటించకూడదని, ప్రజలకు అవస్థలు పాలు చేస్తున్న గుంతల సమస్యను పరిష్కరించేలా నేషనల్ హైవే అధికారులు కూడా వెంటనే తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశామని చింతమనేని ప్రభాకర్ తెలిపారు.సాధారణంగా చింతమనేని ప్రభాకర్ ఎక్కువగా వివాదాస్పద అంశాల్లోనే వార్తల్లో ఉంటారు. ఈ సారి మాత్రం ప్రజా సేవ కోసం ట్రాఫిక్ కానిస్టేబుల్ గా మారి.. హైలెట్ అయ్యారు. గతంలోనూ చింతమనేని ప్రభాకర్ .. ఎమ్మెల్యేగా కాకుండా సామాన్యుడిగా వ్యవహరిస్తూ ప్రజా సేవలో పాల్గొన్నారని కానీ ఆయన వివాదాలపైనే ఎక్కువగా ప్రచారం జరుగుతుందని అనుచరులు అంటున్నారు. తమ నేత కాస్త దూకుడు తగ్గించుకుంటే.. ఆయన మంచి పనులే ఎక్కువగా ప్రచారంలోకి వస్తాయని నిట్టూరుస్తున్నారు.

# తిరుపతి హోటల్స్‌లో కల్తీ ఆహారం

తిరుపతి, ఆగస్టు 11,

టెంపుల్ సిటీ తిరుపతి పవిత్రత దెబ్బతింటోంది. ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులు తమ మొక్కులు సమర్పించుకునేందుకు.. తిరుమల వెళ్తుంటే.. వారికి తిరుపతిలోనే విషాహారాన్ని తినిపించేస్తున్నారు కొందరు. తిరుమల వెళ్లాలంటే.. ముందు తిరుపతిలో దిగాల్సిందే. అక్కడి కాస్త సేదదీరి.. భోజనం చేసి.. తిరుమల బయల్దేరుతారు. కొందరైతే ఇక్కడే విడిదిని ఏర్పాటు చేసుకుని తిరుమల వెళ్లివస్తుంటారు. అయితే తిరుపతిలోని హోటల్స్, రెస్టారెంట్స్, టిఫిన్ సెంటర్ల పరిస్థితి ఎప్పుడైనా గమనించారా? వాటిలో దుర్గంధం మేటలు వేసింది. కల్తీ పొరలు కట్టింది. దీంతో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్త దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి.వెంకన్న సన్నిధి అంటే ఎంత పవిత్రంగా ఉండాలి. తిరుపతి-తిరుమలను ఎవరూ వేర్వేరుగా చూడరు. తిరుపతి చేరుకున్నామంటేనే ఆధ్యాత్మికత బయటకు వస్తుంటుంది. నిత్యం వేలాదిమంది భక్తులతో కిటకిటలాడే ప్రాంతం తిరుపతి. శ్రీవారి దర్శనం చేసుకునేందుకు వచ్చే భక్తులతో రద్దీగా ఉండే టెంపుల్ సిటీలో కల్తీ ఆహారం ఇప్పుడు పెద్ద సమస్యగా మారిపోయింది. భక్తులకు రమ్యంగా స్వాగతం పలుకుతున్నా.. ఈ హోటల్స్ , రెస్టారెంట్స్ మాత్రం కంటిలో నలుసులా.. కాలికి ముల్లులా తయారయ్యాయి. రెండు రోజులుగా ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు 20 టీమ్స్‌గా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారు. తొలి రోజు 30కి పైగా హోటల్స్, రెస్టారెంట్స్‌లో ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖ అధికారులు సోదాలు చేశారు. చాలా హోటల్స్‌లో కల్తీ ఆహారాన్ని గుర్తించారు. అంతేకాదు.. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించి సీజ్ చేశారు. రీనెస్ట్ హోటల్‌లో జరిపిన తనిఖీల్లో కుళ్ళిపోయి బూజు పట్టిన మాంసం బయటపడింది. వెంటనే అధికారులు మాంసాన్ని సీజ్‌చేసి ల్యాబ్‌కు పంపారు. హోటల్‌కు నోటీసులు జారీచేశారు. చాలా హోటల్స్‌లో ముందురోజు తయారుచేసిన బిర్యానీ, కోడిగుడ్లు, ఇతర ఆహార పదార్థాలను గుర్తించారు. అంతేకాదు.. కొన్ని పాన్‌షాపుల్లో 3-4 రోజుల క్రితం తయారుచేసిన కిళ్లీలను గుర్తించి.. సీజ్ చేశారు.ఇక రెండో రోజు బేకరీలు, స్వీట్ స్టాల్స్, తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ సుధాకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తిరుపతితో పాటు పరిసర ప్రాంతాల్లో రెండో రోజు కూడా 20 టీమ్స్ గా ఏర్పడి సంయుక్త దాడులు చేపట్టారు. రేణిగుంటలోని ఈః ఫుడ్స్, ఇండస్ట్రియల్ ఏరియాలోని క్యూటీ ఫ్రూటీ పరిశ్రమల్లో దాడులు నిర్వహించారు. తయారీ విధానాన్ని, వాడుతున్న ముడిసరుకులు, రసాయనాలు, రంగులపై ఆరా తీసిన అధికారులు ఎలాంటి లైసెన్సులు లేకుండా ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అసలు లైసెన్సులకే అప్లై చేయకుండా ఆహారపదార్థాల తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. ప్రమాదకరమైన రంగుల వాడడంతో పాటు అపరిశుభ్ర వాతావరణంలో తయారీపై యజమానులను నిలదీశారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి, తయారీ కేంద్రాన్ని సీజ్ చేస్తున్నట్టు అధికారులు చెప్పారు.ఇక రేణిగుంటలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఫ్రూట్ కేప్స్ పరిశ్రమలో ఎలాంటి ప్రమాణాలు పాటించడంలేదని గుర్తించారు. శాంపిల్స్ సేకరించి నోటీసులు జారీ చేశారు. పరిమితికి మించి రంగులు, ప్రమాదకర రసాయనాలు వాడుతున్నారని గుర్తించారు. మరోవైపు ప్యాకింగ్ లోనూ ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేల్చారు.

## జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూం ఇళ్ళ నివాసితులు ధర్నా

హైదరాబాద్

జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూం ఇళ్ళ నివాసితులు ధర్నాకు దిగారు. కార్యాయంల గేటు ముందు బైఠాయించారు. తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కు వసతులు కల్పించాలని డిమాండ్. చేసారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

## అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి పి నాలా లో పడ్డ డెలివరీ బాయ్

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

రంగారెడ్డి

మహేశ్వరం నియోజవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని గాయత్రి నగర్ అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి(రాఔఆఖ) నాలా లో జొమాటో డెలివరీ బాయ్ పడిపోయాడు. శనివారం రాత్రి గాయత్రి నగర్ ఎక్స్ రోడ్ నుండి టి కే ఆర్ కమాన్ వద్దకు సర్వీస్ రోడ్డులో వెళుతుండగా అసంపూర్తిగా వదిలేసిన ఎస్ ఎన్ డి పి(రాఔఆఖ)నాలాలో డెలివరీ బాయ్ ఫరాన్(25) బైక్ తో సహా పడిపోయాడు. స్థానికంగా ఉన్న షాప్ నిర్వాహకులు పడిపోయిన వ్యక్తిని గమనించి ప్రాణాలతో బయటికి తీశారు, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులు వచ్చి పూడికలు తీసి వెళుతున్నారు కానీ శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయడం లేదని స్థానికులు తెలిపారు.

## బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

చొప్పదండి

పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం ఆదేశానుసారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి రాష్ట్ర



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చొప్పదండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపట్టిన అభివృద్ధి పనులను పలువురు నేతలు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘణ విజయం సాధిస్తారని తెలిపారు.ప్రతి కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వొడ్నాల యఘ్నేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా నాయకులు రామిడి రాజిరెడ్డి,దుబ్బాసి బుచ్చయ్య,కంకనాల రాజ గోపాల్ రెడ్డి,పడితపెల్లి కిషన్, శేఖర్ రెడ్డి,దూలం విరేశం గౌడ్,గుజ్జుల బాపు రెడ్డి,పెంచాల చందు,అంజి రెడ్డి,సాగి అజయ్ రావు,మ్యాక వినోద్, గ్రామ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ గడ్డం అంజయ్య,గడ్డం లక్ష్మణ్ జానీ, విలాసాగరం గంగయ్య, గడ్డం కొండయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాలస్తీనా ర్యాలీపై బీజేపీ ఆగ్రహం

## జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్.

ఖమ్మం

పాలస్తీనా సంఘీభావం పేరుతో ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీపై బీజేపీ ఘాటుగా స్పందించింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో భాజపా నేతలు సోమవారం జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు సమర్పించారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులను అనుమతి లేకుండా పాల్గొనిపించడం, జాతీయ జెండాతో పాటు విదేశీ జెండాలను ఊపించడం, మతపరమైన భావజాలాన్ని పిల్లల మదిలో నింపే ప్రయత్నం చేయడం దేశ హితానికి విరుద్ధమని, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో, ఇటీవల జరిగిన ర్యాలీకి సంబంధించిన అన్ని సంఘటనలను బీజేపీ నేతలు వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, మానవత్వం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు ఆడటాన్ని ఖమ్మం ప్రజలు ఇక సహించబోరని హెచ్చరించారు. గాజా కోసం, పాలస్తీనా కోసం మీరు రోడ్లపై వేల ర్యాలీలు చేస్తారని, కానీ ఖమ్మం ప్రజల బాధలకు మాత్రం ఎప్పుడూ మౌనం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు.2023లో కాల్వట్టులో జరిగిన దారుణాన్ని గుర్తు చేస్తూ, ఒక హిందూ యువకుడిని ముస్లిం దుండగులు పెట్రోల్ పోసి మంటగలిపి హతమార్చిన సంఘటనపై ఒక్క స్పందన కూడా రాలేదని, రెండు నెలల క్రితం రైల్వే స్టేషన్ వద్ద 50 మంది ముస్లిం యువకులు టీ స్టాల్ యజమానిపై దాడి చేసినప్పుడు కూడా ఎటువంటి ఆందోళన కనిపించలేదని ఆయన ప్రశ్నించారు.

## హర్ దిల్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా..

### - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రతి మదిలో, ప్రతి ఇంటిపైనా దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోందని.. ప్రతి గుండె ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పంద్రాగస్టు వేడుకలకు సిద్ధమవుతున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయవాడ ఓల్డ్ జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు వాకర్స్ క్లబ్ వంటి వివిధ అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బైక్, సైకిల్ ర్యాలీతో పాటు స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్రివర్ణపతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, ఓల్డ్ జీజీహెచ్ రహదారులు మార్మోగిపోయాయి. అమరవీరుల బలిదానం.. నేటి స్వేచ్ఛా భారతం, త్రివర్ణ పతాకం ఐకమత్యానికి సంకేతం నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సరిహద్దుల్లో మన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని.. ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఏదో ఒక రోజుకి పరిమితం కాకుండా ప్రతి హృదయమూ త్రివర్ణ పతాక ఐక్యతా స్ఫూర్తిని నింపుకొని ప్రతిరోజూ ముందడుగు వేయాలని, ప్రతిఒక్కరూ దేశ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి గొప్ప కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నందుకు గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్వేచ్ఛ.. ఎందరో మహనీయుల త్యాగ ఫలితం: సీపీ ఎస్వీ రాజశేఖరబాబుమనం నేడు అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితమని.. మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో రంగాల్లో ముందుకెళ్లామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దేశమంటే మాతృమూర్తితో సమానమని.. దేశభక్తితో దేశాభివృద్ధికీ ప్రతిఒక్కరూ సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రగతి పథంలో వడివడిగా ముందడుగు వేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని రాజశేఖరబాబు అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్

ఓట్ల చోరీ వ్యవహారంలో విపక్షాల ఉద్యమంతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా పలువురు ఎంపీలు నినాదాలు చేస్తూ సంసద్ మార్గ్ ధర్నాకు దిగారు. దీంతో రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అరెస్ట్ చేసి బస్సుల్లో తరలించారు

## కత్తులతో వీధుల్లో దొంగలహల్ చల్

ఖమ్మం

ఖమ్మంలో దొంగలు హల్ చల్ చేస్తున్నారు.గొల్లగూడెంలో చోరీలు చేసేందుకు దొంగలు వీధుల్లో తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. చేతిలో మారణాయుధాలతో మాస్కులు ధరించి భయానకంగా ఉన్నారు. తాళం వేసిన ఓ ఇంట్లోకి ప్రవేశించి కలియతిరిగిన దృశ్యాలు వైరలవ్వగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లిలోని సింగరేణి కాలరీప్ లో కుడా దొంగలు చోరీకి ప్రయత్నించారు.

## జాతీయ నులిపురువుల నివారణ దినోత్సవం

### పాల్గొన్న రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...

ధర్మపురి విద్యార్థులు ఆరోగ్యంతోనే దేశ భవిష్యత్తు ఆధారపడిందని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు మంత్రి లక్ష్మణ్ కుమార్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ పథకం తీసుకొచ్చిన ప్రజల సంక్షేమం కొరకేనని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కొరకు అందజేస్తున్న నులి పురుగు నివారణ మాత్రలు ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవని ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయని ఎలాంటి అపోహలు లేకుండా నిబంధనల ప్రకారం మాత్రలు వేయాలని హెల్త్ అధికారులకు సూచించారు మంత్రి.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా డి.ఎం. అండ్. హెచ్. ప్రమోద్, ఓ. సి.డి.పి. ఓ వాణిశ్రీ ,పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్ వాడిలు ,హెల్త్ సిబ్బంది , పాల్గొన్నారు.

# మారనున్న విశాఖ రూపు రేఖలు

విశాఖపట్టణం, ఆగస్టు 11,

ఉమ్మడి ఏపీలోహైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ ఐటీ సంస్థలు వచ్చిన తర్వాత ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్ ముఖచిత్రం కూడా మారనుంది. ఏపీకి దిగ్గజ ఐటీ సంస్థ గూగుల్ రానుంది. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఇది ఏపీకి గేమ్ చేంజర్ కానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు గూగుల్ 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనుంది. దీంతో లక్షలాది ఉద్యోగాలు రానున్నాయి.గూగుల్ సంస్థ విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ ను నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు ఆసియాలోనే అతి పెద్దదిగా తెలుస్తోంది. భారతదేశంలో మొదటి ప్రత్యక్ష డేటా సెంటర్ కూడా కానుంది. ఇప్పటికే గూగుల్ సింగపూర్, మలేషియా, థాయిలాండ్లలో సైతం విస్తరించింది. ఈ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు సంబంధించి మధురవాడలో 500 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించనుంది. ప్రాథమికంగా 80 ఎకరాల్లో ఈ డేటా సెంటర్ పనులు ప్రారంభం కానున్నాయి. అయితే విశాఖకు ఈ దిగ్గజ ఐటీ సంస్థ రావడం మాత్రం నవ్యాంధ్రప్రదేశ్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అంశాలకు దాహదం.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో.. భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకుఎంతగానో దోహదపడనుంది. ప్రధానంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, యూట్యూబ్, సెర్చ్ ఇంజిన్ వంటి గూగుల్ సేవలను ఇది మరింత ఊతం ఇవ్వనుంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. సాంకేతిక శిక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాలలో మరిన్ని పెట్టుబడులు వస్తాయి. రెండు బిలియన్ డాలర్ల పునరుత్పాదక శక్తి పెట్టుబడి.. పర్యావరణ స్థిరత్వాన్ని కూడా ప్రోత్సహించనుంది. ఇది భారతదేశ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. విశాఖపట్నం ఆసియా ఖండంలోనే డిజిటల్ హబ్ గా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

# దేశం దృష్టి బీసీల వైపే

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్

జయశంకర్ భూపాలపల్లి,

దేశవ్యాప్తంగా కోరుకున్నట్లుగానే మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం 2026 నుండి దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని, కులగణన జరిగిన తర్వాత జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పిస్తామని బీసీలకు హామీ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2026లో నిర్వహించబోయే కులగణనలో చేపట్టే విధివిధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు హామీనిచ్చినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి..రాష్ట్రంలో కులగణన చేపట్టి..బీసీలకు 42 శాతం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో రిజర్వేషన్లను కల్పించేందుకు బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి..ఆ బిల్లుకు ఆమోదం తెలిపి..గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తే..మూడు నెలల్లో ఆ బిల్లుపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తుందని మండిపడ్డారు.10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయవచ్చు. కానీ..జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు స్థానికంగా 42 శాతం రిజర్వేషన్లను పొందకూడదా..? అని మహేందర్ గౌడ్ బిజెపి నాయకులను నిలదీశారు. హిందుత్వం ముసుగులో వంటకాగుతూ..అగ్రవర్ణాలకు, బ్రాహ్మణులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఘాటుగా విమర్శించారు. బీసీల్లో ఉత్పత్తి కులాలు..సేవా కులాలు ఉన్నాయని, దేశంలోని 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలు దేశ సంపదను సృష్టిస్తే..ఆ సంపదనంతా 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు దోచిపెడుతున్న ప్రభుత్వాల భరతం పడతామని మహేందర్ గౌడ్ హెచ్చరించారు. మా సోదరులు ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అది జరగాల్సిందే..చివరకు అగ్రవర్ణాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కానీ సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది బీసీ లేనని..మరీ బీసీలు చేసిన పాపం ఏంటని..? ఆయన పాలకులను నిలదీశారు. బీసీలుగా పుట్టడమే మా శాపమా..? ఈ అగ్రవర్ణ పార్టీలు, పాలకులకు ఓట్లు వేయడమే మేము చేసుకున్న పాపమా..? ఇదెక్కడి న్యాయం..అందరికీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు..బీసీలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బీసీల సమాగ్రాభివృద్ధిని..దేశాభివృద్ధిగా చూసినట్లయితే రాష్ట్రంలో, దేశంలో 60 శాతం జనాభా ఉన్నటువంటి బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పుడే దేశం స్వర్ణ భారత్..అఖండ భారత్ గా విరాజిల్లుతుందన్నారు. బీసీలు ఎదిగేందుకు సమానమైన అవకాశాలు కల్పిస్తే..భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశం అవుతుందని, బీసీల అభివృద్ధిని..పాలకులు దేశాభివృద్ధిగా, రాష్ట్రాల అభివృద్ధిగా చూడాలన్నదే బీసీల డిమాండ్ అని తెలిపారు. 60 శాతం ఉన్న బీసీలు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళు అవుతున్న..18 శాతమే రాజకీయ పరిజ్ఞానం. ఆ తర్వాత ఉద్యోగరంగంలో 11 శాతం మొత్తం కలిపితే 29 శాతం మాత్రమే ఉన్నారన్నారు.

# అడవి తల్లిబాటకు శ్రీకారం

విశాఖపట్టణం, ఆగస్టు 11

ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న సౌకర్యం చివరికి వారి గడపకు రానున్న సమయం ఆసన్నమైంది. కొండలు, అడవులు, లోయల మధ్య ఉంటూ రోడ్డు అనే మాట విని కూడా చూడని గిరిజన ఆవాసాల జీవితం ఇక పూర్తిగా మారబోతోంది. ఒక నిర్ణయం, ఒక ప్రణాళిక ఇప్పుడు వారిని అభివృద్ధి దిశగా నడిపించబోతుంది. ఈ ప్రణాళిక పూర్తయ్యే సరికి, ఆ ప్రాంతాల ప్రజలకు ఇది నిజమైన పండుగవలె మారనుంది. ఇంతకు ఆ నిర్ణయం తీసుకున్నది ఎవరో కాదు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్. 'అడవి తల్లి బాట' రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం మధ్యాహ్నం గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో 'అడవి తల్లి బాట' పేరుతో చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం అందనుంది. రూ.1005 కోట్లతో భారీ ప్రాజెక్ట్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ పీఎం జన్ మన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి మొత్తం రూ. 1005 కోట్లతో చేపట్టబడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేని ఆవాసాలను కూడా అనుసంధానించేలా రెండు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. సవాళ్లు, అవరోధాలు.. కానీ అడుగులు ఆగవు అధికారులు సమావేశంలో పనుల ప్రస్తుత స్థితి వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను కలిపే రోడ్లు వేసేందుకు బండరాళ్లను బద్ధలుకొడుతూ ముందుకు సాగడం వల్ల ఎక్కువ సమయం పట్టుతోందని, అలాగే నిటారుగా ఉన్న ప్రాంతాలు కావడంతో సాంకేతిక జాగ్రత్తలు తప్పనిసరని చెప్పారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో పనుల వేగం కొంత తగ్గిందని, అయితే ప్రయత్నాలు ఆగలేదని తెలిపారు. అటవీ అనుమతుల సమస్య ? పరిష్కారం దిశగా మొత్తం 128 రహదారి మార్గాలు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండటంతో అటవీ అనుమతులు అవసరమయ్యాయి. వీటిలో 98 మార్గాలకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 186 పనులు ప్రారంభమయ్యాయని, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెక్నికల్ ఎవాల్యుయేషన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డోలీరహిత గిరిజన ఆవాసాల లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం జన్ మన్ పథకం ద్వారా రూ.555.6 కోట్లు కేటాయించి సహకరించారని పవన్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూడా వినియోగిస్తున్నాం. ఇన్ని వనరులు ఉన్నందున 'అడవి తల్లి బాట' పనుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిరంతర పర్యవేక్షణతోనే పనులు వేగంగా పూర్తవుతాయి. సవాళ్లు ఎదురైనా ప్రణాళికాబద్ధంగా అధిగమించాలి. అవసరమైతే అటవీ శాఖతో సమీక్ష జరిపి అనుమతులను త్వరగా పొందాలని పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం అవసరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ పనుల ప్రాధాన్యతను స్థానికులకు తెలియజేయాలని, తద్వారా వారు కూడా సహకరించేందుకు ముందుకు వస్తారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రహదారి సౌకర్యం లేని ఆవాసాలు తొలిసారి రోడ్డు పొందుతున్నాయి. ఇది కేవలం రోడ్డు కాదు, అభివృద్ధి దారిలో ఒక మలుపు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పి వారిలో నమ్మకం, ఉత్సాహం కలిగించాలని ఆయన స్పష్టం చేశారు. డోలీరహిత ఆవాసాల లక్ష్యం ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గిరిజన ప్రాంతాల వాణిజ్యం, విద్య, వైద్య సౌకర్యాలు అన్ని వేగవంతం అవుతాయి. అటు పర్యాటకానికి, ఇటు స్థానికుల ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. రవాణా సౌకర్యం లేని కారణంగా ఇప్పటి వరకు పక్కనున్న పట్టణాలకు చేరుకోవడమే కష్టంగా ఉన్న పరిస్థితి, రోడ్లు అందుబాటులోకి రాగానే పూర్తిగా మారిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ, సాంకేతిక నాణ్యత, ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని సంకల్పించింది. 'అడవి తల్లి బాట' విజయవంతమైతే, ఇది ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి కాంతి ఇప్పటివరకు తాకని గిరిజన ప్రాంతాల గడప దాటబోతోంది.

# టాటా చేతికి అరకు కాఫీ

విజయనగరం, ఆగస్టు 11,

అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కేలా ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే కాకుండా.. మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది ఏపీ ప్రభుత్వం. ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరులో జరిగిన కార్యక్రమానికి చంద్రబాబు హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా గిరిజనుల జీవనోపాధి, అటవీ ఉత్పత్తుల అమ్మకం, పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం వంటి 21 అంశాల్లో ఈ ఒప్పందాలు జరిగాయి. ప్రధానంగా అరకు కాఫీ బ్రాండ్ అంతర్జాతీయంగా విస్తరించేందుకు, మార్కెటింగ్ కోసం దిగ్గజ సంస్థ టాటా కంపెనీ జిసిసి తో ఒప్పందం చేసుకుంది.అరకు కాఫీ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. ఐక్యరాజ్యసమితి నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. చింతపల్లి ప్రాంతంలో రెడ్ చెర్రీ రిఫైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి సబ్ కో సంస్థ ముందుకొచ్చింది. విశాఖ మన్యంలో కాఫీ తోటల విస్తరణకు సంబంధించి ఐటీసీ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళల ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల్లో విక్రయం కోసం ఫ్రాంటీయర్ మార్కెటింగ్ , ఈజీ మార్ట్ లు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. అయితే ఈ ఒప్పందాలన్నీ అరకు కాఫీ చుట్టూ జరగడం విశేషం. ఇప్పటికే జాతీయ స్థాయిలో సైతం అరకు కాఫీకి గుర్తింపు లభించింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా కాఫీ చర్చనీయాంశం అయింది.అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ సాగు విస్తారంగా సాగుతోంది. ముఖ్యంగా పాడేరు ఏజెన్సీలో 11 మండలాల్లోని 2.58 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికే అరకు కాఫీకి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఏకంగా పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు తాజాగా అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ దూసుకెళ్లేలా ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు జరగడం విశేషం. సదరు సంస్థలు అనుకున్న స్థాయిలో అరకు కాఫీని ప్రమోట్ చేయగలిగితే.. అరకు కాఫీ అంతర్జాతీయంగా దూసుకెళ్లడం ఖాయం.

# 8 రాష్ట్రాల్లో సృష్టి రహస్యాలు


హైదరాబాద్, ఆగస్టు 11,

సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసు తీవ్రత జాతీయ స్థాయికి చేరింది. డాక్టర్ నమ్రతకు చెందిన సృష్టి హాస్పిటల్ పెద్ద ఎత్తున నగదు లావాదేవిలు జరపడంతో మనీల్యాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. దాంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి హాస్పిటల్ కేసులోఈడీ రంగ ప్రవేశం చేసింది. తమకు కేసు వివరాలను తెలియజేయాలని ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీసులకు లేఖ రాశారు.డాక్టర్ నమ్రత సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో 8 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించినట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 80 మంది పిల్లలను విక్రయించి రూ.25 కోట్ల వరకు వసూలు చేసినట్లు భావిస్తున్నారు. ఆ డబ్బును డాక్టర్ నమ్రత విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమ్రతా బ్యాంక్ ఖాతాలతోపాటు, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ బ్యాంక్ లావాదేవీలను పరిశీలించిన అధికారులు మనీ లాండరింగ్ జరిగిందని గుర్తించారు. సృష్టి ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రత ఎనిమిది రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చైల్డ్ ట్రాఫికింగ్ ద్వారా కోట్ల రూపాయలు సంపాదించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలతో ఈడీ రంగంలోకి దిగింది.సంతానం కలగడం లేదని ఆస్పత్రికి వస్తున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ఐవీఎఫ్ విధానంలో పిల్లలు పుడతారని నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయాల్లో వసూలు చేసినట్లు డాక్టర్ నమ్రతపై ఆరోపణలున్నాయి. బిక్షాటన చేసేవారు, మద్యం తాగడానికి డబ్బుల కోసం చూసే వారిని తీసుకెళ్లి వారికి వెయ్యి రూపాయల చొప్పున ఇచ్చి వారి వద్ద నుంచి స్పెర్మ్ కలెక్ట్ చేసి ఐవీఎఫ్ చేశారని సైతం ఆరోపణలు వచ్చాయి. ఆపై నవజాత శిశువులను కొనుగోలు చేసి వారినే ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలు అని డాక్టర్ నమ్రత, హాస్పిటల్ సిబ్బంది ఎందరో దంపతుల నుంచి లక్షల రూపాయల చొప్పున వసూళ్లకు పాల్పడ్డారు.ఇటీవల విజయవాడ పోలీసులు ఒక నవజాత శిశువును అమ్ముతున్న గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్‌లో అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ గ్యాంగ్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ పిల్లలను అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. విజయవాడలో ఇలాంటి మూడు నుంచి నాలుగు గ్యాంగ్లు క్రియాశీలంగా ఉన్నాయని సమాచారం. ఈ గ్యాంగ్లకు సృష్టి హాస్పిటల్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ సభ్యులు సృష్టి హాస్పిటల్ హైదరాబాద్ ఆఫీస్, విజయవాడ బ్రాంచ్‌ను సైతం సందర్శించినట్లు పోలీసులకు ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ కేసులో పోలీసులు ఇదివరకే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. డాక్టర్ నమ్రత కేసు విచారణలో పోలీసులకు సహకరించడం లేదు. పైగా త్వరలోనే బయటకు వచ్చాక తనను ఇబ్బంది పెట్టిన వారి సంగతి చూస్తానని చెప్పడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏపీలో జరిగిన దానికి హైదరాబాద్ లో కేసు నమోదు విచారణ చేపట్టారని ఆమె తరపు లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు.

# నేడు ప్రపంచ ఏనుగుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 12వ తేదీన నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగులను కాపాడి సంరక్షించాలన్న ఉద్దేశంతో 2012లో ఈ దినోత్సవం ఏర్పాటు చేశారు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా కలిసిపోయే ఏనుగులకు కూడా భావోద్వేగాలుండటమే కాకుండా తెలివి, జ్ఞాపకశక్తి ఎక్కువపాళ్ళలో ఉంటాయి. దంతాల కోసం, ఇతర శరీర




భాగాల కోసం ఏనుగులను చంపేయడంతో, వాటి సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతుంది. ఏనుగులకోసం ఒక దినోత్సవం ఉంటే వాటి రక్షణపై అవగాహన పెరిగుతుందన్న ఉద్దేశ్యంతో కెనడాలోని కెనజ్వెస్ట్ పిక్చర్స్ చిత్ర నిర్మాతలు ఏనుగుల సంరక్షణ ప్రచారకులు ప్యాట్రిసియా సిమ్స్, మైఖేల్ క్లార్క్ 2011లో దీనిని రూపొందించారు. థాయిలాండ్లోని ఎలిఫెంట్ రీఇంట్రడక్షన్ ఫౌండేషన్ సెక్రటరీ జనరల్ శివపోర్న్ దర్దరానంద మద్దతుతో ప్యాట్రిసియా సిమ్స్, ఎలిఫెంట్ రీఇంట్రోడక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2012, ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రారంభించబడింది. అప్పటినుండి ప్యాట్రిసియా సిమ్స్ ఈ దినోత్సవానికి నాయకత్వం వహిస్తుండగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలలోని 65కి పైగా వన్యప్రాణుల సంస్థలు, చాలామంది వ్యక్తులు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.

# గడప గడపకు సంక్షేమ ఫలాలు-

## శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు

పెద్దపల్లి

మండలంలోని అప్పన్నపేట, బొంపల్లి, మేరపల్లి గ్రామాల్లో రూ.1 కోటి 10 లక్షల నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు, వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింత కుంట విజయరామణారావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల తోపాటు మహిళా సంఘ భవనం, అప్పన్నపేటలో కామన్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించారు. అలాగేఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేసి, ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్తగా రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ.5వందలకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షల పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోలు, సన్న వడ్లకు రూ. 500 బోనస్, ఇసుక సులభతరం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముంగిటకు తీసుకు వచ్చినట్టు చెప్పారు. ప్రతి కుటుంబానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. మరోవైపు గ్రామ గ్రామాన ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. తమ సేవలను గుర్తించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అరె సంతోష్, సందవేణి రాజేందర్, చింతపండు సంపత్, కలబోయిన మహేందర్, నుగిల్ల మల్లయ్య, శంకర్, బొంకురి అవినాష్, ముత్యాల నరేష్, జెడల రాజు, వేరేశం, రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగాధర పోలీస్ స్టేషన్ ఆద్వర్యంలో మధురా నగర్ లో నిర్వహించిన కార్డన్ సెర్చ్

చొప్పదండి పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా గంగాధర మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్ ప్రాంతంలో సోమవారం విస్తృతంగా పోలీసులు కార్డన్ ఌ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో పాత నేరస్థులు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించబడ్డాయని పోలీస్ అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 94 వాహనాలు స్వాధీనం చేయబడ్డాయి. వీటిలో: 91 మోటార్ సైకిళ్లు,1 ఆటో రిక్షాలు,1 కారు, 1 ట్రాక్టర్ దొరికాయని తెలిపారు.ఈ సందర్భంగా మధురా నగర్ చౌరస్తాలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు మరియు వాటి నివారణ మార్గాలపై పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, నేరం జరిగిన గంటలోపే 1930 నంబర్ కు ఫోన్ చేసి, దొంగిలించబడిన సొమ్మును ఫ్రీజ్ చేయించుకోవచ్చని తెలియజేశారు.మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా నేరమని స్పష్టం చేసి, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. షీ టీమ్ సీఐ శ్రీలత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు చైతన్యం కల్పించారు.అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.కరీంనగర్ రూరల్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. వెంకటస్వామి మాట్లాడుతూ చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ సందర్భంగా డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు ."సే నో టూ డ్రగ్స్" అనే పోస్టర్‌ను ఏసీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్ .వెంకటస్వామి , సీఐ ప్రదీప్‌కుమార్ చొప్పదండి, సీఐ శ్రీలత, సీఐ బి. కోటేశ్వరరావు, సీఐ బి. సధన్‌కుమార్, సీఐ కె. సంజీవ్, గంగాధర ఎస్ఐ బి. వంశీకృష్ణ, ఎస్ఐ జి. నరేంద్ర రెడ్డి, ఎస్ ఐ అంటి నార్కోటిక్ బ్యూరో వి.పుల్లయ్య, ఎస్ఐ కె. రాజు, ఎస్ఐ సాయికృష్ణ, ఎస్ఐ సయ్యద్ అన్వర్, ఎస్ఐ పి. లక్ష్మారెడ్డి, ఎస్ఐ టీ. నరేష్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాన్ బోల్తా? వ్యక్తి, గోవులు మృతి


విశాఖపట్నం

సోమవారం ల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో నరసన్నపేట నుంచి విశాఖపట్నం పూర్ణ మార్కెట్ కు ఒక వ్యాన్లో గోవులను రహస్యంగా తరలిస్తుండగా పాత డైరీ ఫారం వద్దకు వచ్చేసరికి ఆ వ్యాన్ ఓ వ్యక్తి ని ఢీ కొట్టి బోల్తా పడింధి ఈ ప్రమాదం లో వ్యాను ఢీ కొట్టిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కొన్ని గోవులు కూడా మృతి చెందాయి..పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేస్తున్నారు

## భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయి -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారత అంతరిక్ష పరిశోధనకు మూల పురుషుడు విక్రమ్ సారాభాయి. అందుకే ఈయన పేరుమీద అంటే విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఉంది. ఇది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం. ఇది భారత ఉపగ్రహ కార్యక్రమానికి చెందిన అంతరిక్ష వాహనాల (శాటిలైట్స్)ను తయారు చేస్తుంది. ఈ కేంద్రం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఉంది. ఈ కేంద్రం 1962 లో తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషనుగా మొదలైంది. 1971 డిసెంబరు 30న భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడైన డా. విక్రం సారాభాయ్ మరణం తర్వాత, ఈ కేంద్రానికి ఆయన పేరు పెట్టారు. ఈ కేంద్రంలోనే సౌండింగు రాకెట్లు, రోహిణి, మేనక లాంచర్లు, ఎస్సెల్వీ, ఏఎస్సెల్వీ, పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి మార్క్ 3 మొదలైన వాహక నౌకల రూపకల్పన కేంద్రమిది. విక్రమ్ సారాభాయి గత 1919 ఆగస్టు 12వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాదులో జన్మించారు. వారి కుటుంబం ధనవంతులైన వ్యాపారస్తుల కుటుంబం. ఆయన తండ్రి అంబాలాల్ సారాభాయ్ అక్కడ పేరు పొందిన పారిశ్రామికవేత్త. ఆయనకు అక్కడ ఎన్నో మిల్లులు ఉండేవి. అంబాలాల్, సరళా దేవి దంపతులకు కలిగిన ఎనిమిది మంది సంతానంలో విక్రం సారాభాయ్ ఒకడు. తన ఎనిమిది మంది పిల్లలను చదివించడానికి విక్రం సారాభాయి తల్లి మాంటిస్సోరీ తరహాలో ఒక ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసింది. వీరి కుటుంబం స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూ ఉండటం మూలాన వారింటికి మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, మరియు జవహర్లాల్ నెహ్రూ మొదలైన ఎంతో మంది ప్రముఖులు తరచూ వస్తూ ఉండేవారు. వీరు విక్రం సారాభాయ్ వ్యక్తిత్వాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. అహమ్మదాబాదులోని గుజరాత్ కళాశాలలో మెట్రిక్ విద్యను పూర్తి చేసుకున్న విక్రమ్ సారాభాయ్... తరువాత పై చదువుల కోసం ఇంగ్లండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 1940వ సంవత్సరంలో అక్కడ నాచురల్ సైన్సెస్‌లో, ట్రిపోస్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఆ సమయంలో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం కావటంతో భారతదేశానికి తిరిగివచ్చిన విక్రమ్



సారాభాయ్... బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సర్ సీ.వీ.రామన్ పర్యవేక్షణలో కాస్మిక్ కిరణాలపై పరిశోధన మొదలుపెట్టారు. తదనంతరం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1945వ సంవత్సరంలో తిరిగీ కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వెళ్లి పీహెచ్‌డీ పట్టాను సాధించుకుని 1947లో తిరిగి భారత్ చేరుకున్నారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించినపుడు... భారత భవిష్యత్ అవసరాలకు శాటిలైట్ల అవసరం గురించి ఎంతో విషయ సేకరణ చేయటమేగాకుండా, ఆ శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్ నెహ్రూకు వివరించి, ఆయనను ఒప్పించారు. ఆ పిమ్మట భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడైన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్‌సీఓఎస్‌పీఏఆర్) సెంటర్‌ను ఆయన ఏర్పాటు చేశారు. తదనంతరం ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ఇస్రో ఎన్నో విజయాలను సాధించి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేసింది. 'భారత అంతరిక్ష రంగ పితామహుడు'గా కీర్తి గడించిన సారాభాయ్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను 1962లో శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డుతో, 1966లో పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. జాతీయ స్థాయిలోను, అంతర్జాతీయంగానూ అర్థవంతమైన పాత్ర పోషించగలగాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని చెప్పి, ఆ దిశగా కృషి చేసిన సారాభాయ్ 1971, డిసెంబరు 31వ తేదీన పరమపదించారు.

# చంద్రబాబు బొమ్మే.. ఐడెంటెటీనా...

విజయవాడ, ఆగస్టు 11,

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 95 సీఎం అంటూ దూసుకుపోతున్నారు. గత మూడు పర్యాయాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, వినూత్న రాజకీయాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, పెట్టుబడులను ఆకర్షించి కొత్త ఉద్యోగాలు సృష్టించడం అన్న లక్ష్యాలతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. గడిచిన 14 నెలలుగా పాలనలో సంస్కరణలు తీసుకువచ్చిన చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టానని అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలకు డబ్బు కేటాయించి వైసీపీ విమర్శలు తిప్పికొడుతున్నారు. తన పనితీరుతో అందరితో శభాష్ అనిపించుకోవాలని తాపత్రయపడుతున్న సీఎం.. సొంత కేడర్ నుంచి ఎదురవుతున్న విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఏడాది క్రితం 4.వా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబుపై విపక్షం కన్నా ఎక్కువగా స్వపక్షమే విమర్శలు గుప్పిస్తోంది. 95 సీఎం అంటూ వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు.. కార్యకర్తలను సంతృప్తి పరిచే నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీనికి టీడీపీ సోషల్ మీడియా వేదికలనే ఉదాహరణగా చెబుతున్నారు. రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాన్చుడు ధోరణిపై సోషల్ మీడియా సైనికులు అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి మండిపడుతున్నారు. అయితే సోషల్ సైనికులు ఒత్తిడికి తలొగ్గి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేమని పార్టీ పెద్దలు తొలుత చెప్పుకొచ్చారు. సొంత వారి విమర్శల నుంచి చంద్రబాబును రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఏడాది అయినా ఈ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సోషల్ మీడియా శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు అధికార చట్రంలో బంధీ మరోవైపు తాను పూర్తిగా మారిపోయినట్లు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు.. మళ్లీ అధికారుల చట్రబంధంలోకి క్రమంగా ఇరుక్కుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీ కార్యకర్తలకు చంద్రబాబుకు మధ్య యథావిధిగా గ్యాప్ వచ్చేస్తోందని అంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కార్యకర్తలకన్నా అధికార యంత్రాంగానికి ఎక్కువ విలువనివ్వడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని వ్యాఖ్యలు ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయని చెబుతున్నారు. గత 14 నెలలో సీఎం ఎక్కువగా అధికార కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారని, కార్యకర్తల సాధకబాధలు తెలుసుకోడానికి అసలు సమయం కేటాయించడం లేదని విమర్శలు ఎక్కువవుతున్నాయి. తాను పూర్తిస్థాయిలో పనిచేస్తున్నా, మంత్రులు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయడం లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలపైనా నిరసన వ్యక్తమవుతోందని అంటున్నారు. చంద్రబాబు సీఎంగా వ్యవహరిస్తున్నారే కానీ, పార్టీ అధినేతగా తమ సమస్యలు తెలుసుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రులు అంతర్గత సంభాషణల్లో వాపోతున్నారని చెబుతున్నారు. వచ్చేఎన్నికల నాటికి పేదరికం అంతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న చంద్రబాబు నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా టార్గెట్లు పెట్టడంపైనా ఎమ్మెల్యేలు, మంత్రులు లబోదిబోమంటున్నారని అంటున్నారు. అందుబాటులో లేని అధినేత ఈ సారి పాలనలో తనలో పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని చూస్తారని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయంపైనా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో ఓ సారి మంత్రి, ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు నిర్వహిస్తానని చెప్పిన చంద్రబాబు.. ఒకరోజు మాత్రమే ఆ పనిచేశారని అంటున్నారు. నిత్యం బిజీ షెడ్యూలుతో సీఎం ఉండటం వల్ల పార్టీ పరమైన సమస్యలు, రాజకీయ నిర్ణయాల విషయంలో ఆయనను సంప్రదించడం కుదరడం లేదని అంటున్నారు. పార్టీ పరంగా మంత్రి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా అందుబాటులో ఉంటున్నా, చంద్రబాబు దృష్టికి తేకుండా ఏ నిర్ణయం తీసుకోలేని వాతావరణం ఉండటం కూడా నియోజకవర్గాల్లో ఇబ్బందులు సృష్టిస్తోందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. దీంతో చంద్రబాబు ఎప్పటిలా వన్ వేలో ప్రయాణిస్తూ తమను వెనక్కి వదిలేస్తున్నారని టీడీపీ ప్రజాప్రతినిధులు లబోదిబోమంటున్నారు.

# ఉద్యమానికి రెడీ అవుతున్న రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 11,



దేశవ్యాప్తంగా 'స్వతంత్ర క్రాంతి' పేరుతో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఉద్యమించేందుకు రెడీ అయ్యారు. ఎన్నికల సంఘం-బీజేపీతో కుమ్మక్కయిందని, ఓట్లను తారుమారుచేసి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. అంతేకాదు.. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక సహా పలురాష్ట్రాల్లో ఓట్ల తారుమార్లు, ఇతర అవకతవకలపై ఉద్యమిస్తామని కూడా ప్రకటించారు. దీనికి సంబంధించి గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇక, కేంద్ర ఎన్నికల సంఘంపై ఇప్పటికే అనుమానాలు ఉన్న.. కొన్ని పార్టీలు కూడా కాంగ్రెస్‌కుదన్నుగా నిలిచాయి. మరీ ముఖ్యంగా తమిళనాడు సీఎం స్టాలిన్ , పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వంటివా రు రాహుల్‌కు ఈ విషయంలో దోహదపడేందుకు రెడీ అయ్యారు. ఉద్యమానికి సహకరిస్తామంటూ.. మౌఖి కంగా ప్రకటించారు. వచ్చే ఏడాది తమ తమ రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు ముందుగానే అప్రమత్తమైనట్టు తెలుస్తోంది.. మొత్తంగా ఎన్నికల విధానం, ఓటర్ల జాబితా రూపకల్పన, నకిలీ ఓటర్లు, ఒకే పేరుతో వేలాది ఓట్లు.. ఇలా కొన్ని ప్రతిపాదనలతో రాహుల్ ఉద్యమిస్తున్నారు. ప్రధానంగా బూత్‌లలో రికార్డు చేసిన సీసీ టీవీ ఫుటేజీని ధ్వంసం చేయడం, ఓటర్ల జాబితాను డిజిటల్ రూపంలో ఇవ్వకపోవడం.. వంటి వాటిని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాలపైనే దేశవ్యాప్తంగా ఉద్యమించేందుకు రాహుల్ ముందుకు వచ్చారు. అయితే.. ఈ విషయంలో కాంగ్రెస్‌లోని మేధావివర్గం మరో సూచన చేస్తోంది. ఈ అంశాలు కరెక్టేనని.. కానీ, ఇంతకు మించి మరో అంశం కూడా చూడాలని సూచిస్తున్నారు. మరోవైపు ప్రజలను ఈవీఎంలకు దూరంగా ప్రేరేపించాలి. అంటే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే.. తాము ఓటు వేసేందుకు వచ్చేది లేదని ప్రజలను కార్యోన్ముఖులను చేయాలి. ఇది కీలకం. ఈ దిశగా రాహుల్ ప్రయత్నించాలి. అప్పుటు అవకతవకలకు అవకాశం తగ్గుతుంది." అని సీనియర్ నేత జైరాం రామేష్ వ్యాఖ్యానించారు. ఇదే అభిప్రాయాన్ని మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్ కూడా చెప్పుకొచ్చారు. మరి రాహుల్ ఈ దిశగా అడుగులు వేస్తారో.. లేదో చూడాలి.

# ట్రంప్ టారిఫ్... అల్లాడుతున్న అమెరికన్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 11,

అమెరికా ఫస్ట్ నినాదంతో అధికారంలోకి వచ్చిన ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రపంచ దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు ఇప్పుడు ఆ దేశానికే నష్టం చేస్తున్నాయి. ట్రంప్ విధించిన టారిఫ్‌లు ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో కలకలం రేపుతున్నాయి. ఈ ఏకపక్ష వాణిజ్య విధానాలు విదేశీ దిగుమతులను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, అమెరికన్ వినియోగదారులపైనే ఎక్కువ భారం పడుతోంది. దుస్తుల నుంచి రోజువారీ అవసర వస్తువుల వరకు ధరలు ఆకాశాన్ని అంటడంతో, అమెరికన్లు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు ఈ ధరల పెరుగుదలను స్పష్టంగా చూపిస్తున్నాయి.ట్రంప్ టారిఫ్‌లు, ముఖ్యంగా చైనా, భారత్, కెనడా, మెక్సికో వంటి దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై విధించిన అధిక సుంకాలు, అమెరికాలో వస్తువుల ధరలను గణనీయంగా పెంచాయి. గతంలో 6 డాలర్లకు లభించిన దుస్తులు ఇప్పుడు 10 డాలర్లకు చేరాయి, అంటే దాదాపు 66% ధరల పెరుగుదల. ఇతర రోజువారీ వస్తువుల ధరలు కూడా 1 డాలర్ నుంచి 10 డాలర్ల వరకు పెరిగాయి. ఈ ధరల పెంపు సామాన్య అమెరికన్ కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ సుంకాల వల్ల అమెరికన్ కుటుంబాల వార్షిక ఖర్చు సగటున రూ. 2 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి, జీవన వ్యయం గణనీయంగా పెరుగుతుంది. అమెరికన్లు సూపర్‌మార్కెట్లలో, దుకాణాల్లో ధరల షాక్‌ను రికార్డ్ చేస్తూ, తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.ట్రంప్ టారిఫ్‌ల ఉద్దేశం అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించడం, వాణిజ్య లోటును తగ్గించడం అని పేర్కొన్నారు. అయితే, ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని విశ్లేషకులు అంటున్నారు. చైనా నుంచి 34%, భారత్ నుంచి 26%, యూరోపియన్ యూనియన్ నుంచి 20% వంటి అధిక సుంకాలు విధించడంతో, దిగుమతి వస్తువుల ధరలు పెరిగాయి. ఈ ధరల పెంపు అమెరికన్ వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతోంది. ఈ టారిఫ్‌లకు ప్రతీకారంగా ఇతర దేశాలు కూడా అమెరికా వస్తువులపై సుంకాలు విధిస్తున్నాయి. కెనడా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25% సుంకం విధించింది. చైనా కూడా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధిస్తూ, ప్రపంచ వాణిజ్య సంస్థలో ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తోంది. ఈ వాణిజ్య యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊహించని నష్టాన్ని కలిగిస్తోంది.ఇదిలా ఉంటే.. ట్రంప్ టారిఫ్‌లు కేవలం అమెరికన్లకు మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సుంకాల వల్ల అంతర్జాతీయ వాణిజ్యం క్షీణించి సప్లై చైన్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా, జపాన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను 'అన్యాయమైన' చర్యగా ఖండిస్తూ, ప్రతీకార చర్యలకు దిగాయి. ఇది అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో అలజడిని కలిగించింది. భారత్‌లో సెన్సెక్స్ 76,617 పాయింట్ల నుంచి 75,811 పాయింట్లకు పడిపోయింది, ఇతర ఆసియా మార్కెట్లు కూడా నష్టాలను చవిచూశాయి. టారిఫ్‌ల వల్ల డాలర్ బాండ్ల మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడింది. జపాన్ వంటి దేశాలు వందల బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను విక్రయించడం ప్రారంభించాయి, ఇది అమెరికా ఆర్థిక విశ్వసనీయతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ పరిణామాలు డాలర్ విలువను బలహీనపరిచే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ భారత్‌పై 26% నుంచి 50% వరకు సుంకాలు విధించారు, దీనికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగించడమే కారణమని పేర్కొన్నారు. ఈ సుంకాలు భారత ఎగుమతులను దెబ్బతీసినప్పటికీ, కొన్ని రంగాలైతే లాభపడే అవకాశం ఉంది. చైనాపై అధిక సుంకాల వల్ల భారతీయ టెక్స్‌టైల్, ఫార్మా, ఆటోమొబైల్ విడిభాగాల రంగాలు అమెరికా మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచుకోవచ్చు.విజయమా, విఫలమా?ట్రంప్ టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థను రక్షించడంలో విజయవంతం కాకపోవచ్చని నిపుణులు అంటున్నారు. ఈ సుంకాలు స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించే బదులు, వినియోగదారులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. అమెరికన్ ఆర్థిక వేత్తలు ఈ టారిఫ్‌లను 'రెండు వైపులా పదునైన కత్తి'గా అభివర్ణిస్తున్నారు. అంతేకాదు, ఈ విధానాలు అమెరికా యొక్క అంతర్జాతీయ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి, ఇది దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలకు దారితీస్తుంది.

## రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు

నిజామాబాద్, ఆగస్టు 11,

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లకు ఒక విడత, బోధన్‌కు మరో విడత పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. స్థానిక సంస్థల పదవీకాలం పూర్తయ్యి దగ్గరదగ్గర ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించలేదు. ఈ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో.. సెప్టెంబర్ 30 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరి అయ్యిందిఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసి రెడీగా ఉంది. నోటిఫికేషన్ రావడమే తరువాయి అంటున్నారు అధికారులు. అయితే త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగున్నాయి. ఈ క్రమంలో సర్పంచి ఎన్నికలకు సంబంధించిన ఓ వార్త వినిపిస్తోంది. రెండు విడతల్లో సర్పంచి ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఆ వివరాలు..రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికల గురించి కీలక ప్రకటన చేసింది. గతంలో అనగా 2019 సర్పంచ్ ఎన్నికలు రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతలుగా జరిగేవి. కానీ ఈసారి రెండు విడతల్లోనే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనికి తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరిగాయి. రాజకీయ పార్టీల గుర్తులు ఉండవు కాబట్టి ఫలితాలపై ప్రభావం ఉండదని అలా చేశారు. కానీ ఈసారి రెండు విడతల్లోనే పోలింగ్ పూర్తి కానుంది.ఈక్రమంలో నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ అనే మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. జిల్లా అధికారులు అంచనా ప్రకారం ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్లకు ఒకసారి, బోధన్‌కు మరోసారి పోలింగ్ జరిగే అవకాశం ఉంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది అంటున్నారు. పంచాయతీ ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు తెలుపుతున్నారు.ఎన్నికల నిర్వహణ కోసం నిజామాబాద్ జిల్లాలో ఉన్న వాటితో పాటు కర్ణాటక నుంచి కూడా తెప్పించమని చెప్పుకొచ్చారు. సర్పంచ్ స్థానాలకు 2,531 జంబో పెట్టెలు, వార్డు సభ్యుల స్థానాలకు 1,380 చిన్న పెట్టెలు రెడీగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి భద్రంగా ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తం 545 గ్రామ పంచాయతీల్లో 5,022 వార్డులు ఉన్నాయి. మొదటి దశ పోలింగ్ అయిపోయిన తర్వాత బ్యాలెట్ పెట్టెలను రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాలకు తరలిస్తారు.బ్యాలెట్ పేపర్ల ముద్రణ కూడా పూర్తయిందని అధికారులు తెలిపారు. గులాబీ రంగువి (సర్పంచి) 9.21 లక్షలు, తెలుపు రంగువి (వార్డు సభ్యులు) 9.20 లక్షలు ముద్రించి ఎన్నికల విభాగం స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఎన్నికల సంఘం చెప్పిన విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

## నెలాఖరులో స్థానిక' నగారా

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో నగారా మోగే అవకాశాలున్నాయి. ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని టీపీసీసీ నుంచి ఎమ్మెల్యేలు, నాయకులకు ఆదేశాలు అందినట్లు సమాచారం, రాజకీయాల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు ఆమోదం కోసం రాష్ట్రపతి చెంతకు చేరాయి.వాటిని ఆమోదించేలా ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ఢిల్లీలోనే ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ధర్నా చేశారు. పార్లమెంట్‌లో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసి పుచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన మేరకు గడువు ముంచుకు వస్తున్నది. ఆ గడువులోగానే ఎన్నికలు నిర్వహించేం దుకు ముందుకు పోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఓవైపు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికార పార్టీ సన్నద్ధం అవుతున్నది. రాజకీయాల వ్యవహారాల కమిటీ పీఏసీ,లోమంత్రులతో చర్చించిన తర్వాత ఎన్నికలపై ముందుకు సాగుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు రెండు, మూడు రోజుల్లో సమావేశాలు నిర్వహిం చేందుకు సన్నద్ధం అవుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మార్గాలను అన్వేషిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుక వచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధనను పక్కనబెట్టి జీఓ తీసుకరావడం, ఎన్నికలు నిర్వహించకుండా నిలువరించడం, పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించే మార్గాలను అన్వేషిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే ఆలస్యమయ్యింది. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంగా మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, ఆరు మాసాలుగా మున్సి పాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ప్రభుత్వంపై రాజకీయ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

# కవితది వ్యూహాత్మకమా...

హైదరాబాద్, ఆగస్టు 11

కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ మహిళా నాయకురాలు, తెలంగాణ ఉద్యమ నాయకురాలు. గులాబీ పార్టీ నుండి ఎంపీగా గెలిచిన మహిళా నేత. ప్రస్తుతం ఆ పార్టీ నుండే ఎమ్మెల్సీగా పని చేస్తున్నారు. అంతేకాకుండా, స్వయానా బీఆర్ఎస్ చీఫ్ కూతురుగా పార్టీలో గుర్తింపు పొందిన నేత. అయితే గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయ పరిణామాలకు తగ్గట్టుగా తనదైన రాజకీయ భాష్యాన్ని తన చర్యల ద్వారా కవిత చెప్పకనే చెబుతున్నారు. సొంత పార్టీతోనే ఢీ అంటే ఢీ అనేలా సవాల్ విసురుతున్నారు. వ్యూహాత్మక కార్యాచరణతో గులాబీ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. మద్యం కుంభకోణం ఆరోపణలతో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కవిత తన సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు రావడం, ఆ తర్వాత మీడియా సమావేశంలో తన లేఖను బయటపెట్టిన వారి పేర్లు వెల్లడి చేయాలని పార్టీని డిమాండ్ చేయడం తెలిసిందే. సమయం, సందర్భం చిక్కినప్పుడల్లా గులాబీ ముఖ్య నేతలపై కవిత రాజకీయ విమర్శలు చేస్తూనే ఉన్నారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని బహిరంగంగానే మీడియా ముందు కవిత తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.అంతటితో మౌనంగా ఉండని కవిత, తన ఆధ్వర్యంలో నడిచే తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే దిశగా పలు చర్యలు చేపట్టారు. మరోవైపు, కాళేశ్వరం కమిషన్ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇందిరా పార్కు వద్ద ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ పార్టీ చేయనిది తాను కేసీఆర్ కోసం ఈ ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించి, పార్టీకి, పార్టీ కార్యకర్తలకు తనదైన శైలిలో రాజకీయ సందేశం పంపారు. ఆ తర్వాత బీసీ ఉద్యమ కార్యాచరణను ఎత్తుకొని మరోసారి ఇందిరా పార్కు వద్ద ధర్నా చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అనుమతి లేకుండానే తాను ఆయా రాజకీయ పార్టీల నేతలను కలుసుకుని మద్దతు కోరడం విశేషం. ఈ చర్యలతోనే కవిత తన సొంత దారి తాను చూసుకుంటున్నానన్న సందేశం చెప్పకనే చెప్పారు.బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాసిన లేఖ బయటపడిన నాటి నుండి కవిత తెలంగాణ భవన్ గడప తొక్కలేదు. అంతేకాదు, కేసీఆర్ నుండి కూడా ఎలాంటి ఆహ్వానం రాలేదు. చివరకు ఫాంహౌస్ నుండి కాళేశ్వరం కమిషన్ ఎదుటకు కేసీఆర్ బయలుదేరే సమయంలో కూడా కవిత దూరం దూరంగానే తండ్రిని ఫాలో అవ్వడం, మీడియాకు రిలీజ్ చేసిన దృశ్యాల్లో కనిపించడం విశేషం. అయితే అక్కడ ఏం జరిగిందన్నది మనం చెప్పలేం కానీ, రాజకీయ చతురుడైన కేసీఆర్ మీడియా ముందు ఏం చేసినా దానికి ఒక లెక్క ఉంటుందని, మీడియా ముందు ఎవరితో మాట్లాడినా, భుజం మీద చేయి వేసినా కూడా ఒక లెక్క ఉంటుందన్న విషయం గులాబీ పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. అలాంటిది సొంత కూతురు, పార్టీలో సీనియర్ మహిళా నేత అయిన కవిత దూరంగా ఉండటం, కేసీఆర్ కూడా దూరంగా ఉన్నట్లు కనిపించడం కొట్టిపారేసే విషయం ఏమీ కాదు.ఇదిలా ఉంటే, కవిత ఇప్పటి వరకు చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో గులాబీ కండువా ఎక్కడా వేసుకోకపోవడం, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ ఈ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం గమనించాల్సిన మరో విషయం. కేసీఆర్ కోసం ఇందిరా పార్కు వద్ద చేసిన ధర్నాలోనూ తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతి కండువా కప్పుకొని పాల్గొన్నారు. ఆ తర్వాత బీసీ ఉద్యమంలోనూ తన కండువాతో పాటు, బీసీ ఉద్యమానికి సూచిక అయిన నీలి రంగు కండువా కప్పుకున్నారు. ఇక తాజాగా హెచ్ఎంఎస్ కార్మిక సంఘం నేతలతో జరిగిన సమావేశంలోనూ హెచ్ఎంఎస్ కండువా కప్పుకొని మీడియా ముందు కనిపించడం కూడా రాజకీయ సందేశంగానే చెప్పుకోవాలి. ఈ పరిణామాలన్నీ గమనిస్తే కవిత గులాబీ కండువాను దూరం పెట్టిందని తెలుస్తోంది.ఇక తాజా విషయానికి వస్తే, బీఆర్ఎస్ పార్టీ తనను ఒంటరి చేస్తోందని చెబుతున్న కవిత అందుకు తగ్గట్టుగా తన రాజకీయం ఏంటో చూపిస్తున్నట్లుంది. తెలంగాణలో సింగరేణి కార్మికుల ప్రభావం ఎక్కువే. చాలా నియోజకవర్గాల్లో వీరి ప్రభావం కనిపిస్తుంది. బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి తర్వాత టీజీబీకేఎస్ పదవి నుండి కవితను తప్పించారు. ఆ స్థానంలో కొద్ది రోజుల క్రితమే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ నియమించింది. ఈ పరిణామానికి కవిత కూడా దూకుడుగా స్పందిస్తుండటం చూస్తే ఢీ అంటే ఢీ అని బీఆర్ఎస్ కు సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తుంది.ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి సంస్థకు అనుబంధంగా కార్మిక విభాగాన్ని పటిష్టం చేశారు. కొత్త శాఖలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఏ పార్టీతో సంబంధం లేని హెచ్ఎంఎస్ కార్మిక సంఘంతో భేటీ అయి వారితో కలిసి పని చేయనున్నట్లు ప్రకటించారు. ఇది చూస్తుంటే రానున్న రోజుల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగితే సింగరేణితో సహా ఆయా పారిశ్రామిక సంస్థల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాల ఓటమికి కవిత పని చేయాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇదే జరిగితే బీఆర్ఎస్ తో కవిత అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధపడినట్లే. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ లో ఎలాంటి రాజకీయ మార్పులు తెస్తాయో వేచి చూడాల్సిందే.బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీగా ఉంటూ, పార్టీ అనుబంధ కార్మిక సంఘాలు ఉన్నా, మరో పోటీ కార్మిక సంఘంతో కవిత చేతులు కలపడం అనేది పార్టీ లక్ష్మణ రేఖ దాటినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇది రాజకీయంగా బీఆర్ఎస్ ను బలహీనపరిచే చర్యగా అభివర్ణిస్తున్నారు. పార్టీని కాదని కవిత చేసిన ధర్నాలు ఒక ఎత్తయితే, మరో కార్మిక సంఘంతో కలిసి పని చేస్తానని చెప్పడం మరో ఎత్తు. ఇది నేరుగా పార్టీకి సవాల్ విసిరినట్లే అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ చర్యల ద్వారా తాను బలమైన నాయకురాలిని అన్న సంకేతాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇప్పటి దాకా అటు కేసీఆర్ కానీ, కేటీఆర్ కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం, కవితపై క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడం లేదా ఈ అసమ్మతిని తగ్గించేలా పిలిచి మాట్లాడకపోవడం అనేది వ్యూహమా లేక ఇది దీర్ఘకాలికంగా పార్టీకి నష్టం చేస్తుందా అన్నది మాత్రం వేచి చూడాలి.

# రామచంద్రరావు బండి మార్క్...

హైదరాబాద్, ఆగస్టు 11

బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. పార్టీ వ్యవహారాలు జోరుగా సాగేవి. అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలంగాణకు అనేక పర్యాయాలు వచ్చారు.. తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. సంజయ్ కూడా పార్టీ కార్యకలాపాలను ఉ ధృతంగా సాగించేవారు. భారత రాష్ట్ర సమితి పరిపాలన కాలంలో బండి సంజయ్ రెండు పర్యాయాలు పోలీసుల చేతిలో అరెస్టు అయ్యారు. బండి సంజయ్ నాయకత్వంలోనే భారతీయ జనతా పార్టీ దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి తిరుగులేని పోటీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ రెండవ స్థానంలో నిలిచింది. హుజరాబాద్ ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఒకరకంగా బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో జవసత్వాలు కల్పించారని చెప్పుకోవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధినాయకత్వం ఒకసారి గా బండి సంజయ్ ని తప్పించింది. ఆయన స్థానంలో కిషన్ రెడ్డి నియమించింది. ఆయినప్పటికీ భారతీయ జనతా పార్టీ 2018 ఎన్నికల తో పోల్చుకుంటే 2023లో గణనీయమైన ఫలితాలను సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 8 స్థానాలను సొంతం చేసుకుంది. అయితే బండి సంజయ్ కనుక తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా ఉంటే పార్లమెంటు స్థానాలు మరిన్ని పెరిగేవని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ఎందువల్ల బండి సంజయ్ ని మార్చాల్సివచ్చిందో ఇప్పటికీ క్లారిటీ లేదు. బండి సంజయ్ కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చినప్పటికీ.. ఇప్పటికీ కార్యకర్తల్లో సంజయ్ లేని లోటు కనిపిస్తూనే ఉంది.ఇటీవల రామచంద్రరావు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా నియమించింది. ఆయనకు అధ్యక్ష పదవిని ఇవ్వడాన్ని పార్టీలో కొంతమంది నాయకులు జీర్ణించుకోలేకపోయారు. నేరుగా తమ నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ బిజెపి కేంద్ర నాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. అయితే ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ కు పార్టీ కేంద్ర నాయకత్వం తేరలేపినట్టు కనిపిస్తోంది. అందువల్లే భారత రాష్ట్రసమితికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కాషాయ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. ఇంకా కొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు లైన్లో ఉన్నారని రామచంద్రరావు అంటున్నారు. ఒకవేళ గనుక ఇదే స్థాయిలో చేరికలు గనుక కొనసాగితే బిజెపి 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి బలపడుతుందని కాషాయ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు.. రామచంద్ర రావు బండి సంజయ్ మాదిరిగానే పార్టీలో దూకుడు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని వారు చర్చించుకుంటున్నారు.. ఒకవేళ రామచంద్రరావు సంజయ్ మాదిరిగానే జోరు కొనసాగిస్తే మాత్రం బిజెపికి తిరుగు ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# జనసేన ఆఫీసులో తెలంగాణ మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 11,

తెలుగు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్దకు తెలంగాణ మంత్రులు వెళ్లారు. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి జనసేన కేంద్ర కార్యాలయం వద్దకు వెళ్లారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తరుపున ఏపీ ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ వీరికి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కొండపల్లి బొమ్మలతో కూడిన జ్ఞాపికలను బహూకరించారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.అయితే పోలవరం బనకచర్ల ప్రాజెక్టు వ్యవహారంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రాజకీయాలు వేడెక్కాయి. సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలను వాడుకుని రాయలసీమను సస్యశ్యామలం చేస్తామంటూ పోలవరం బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. సుమారుగా 80 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. అయితే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్రం నీటి హక్కులకు భంగం కలుగుతుందంటూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టు మీద అభ్యంతరం తెలిపారు. కేంద్ర జలసంఘం వద్ద కూడా దీనిపై తమ అభ్యంతరాలను తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలతో బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి.ఇలా రెండు రాష్ట్రాల మధ్యన రాజకీయ వాతావరణం వేడెక్కిన తరుణంలో తెలంగాణ మంత్రులు ఐదుగురు.. జనసేన కేంద్ర కార్యాలయంలో దిగటం ప్రాధాన్యం సంతరించుకుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి జనసేన ఆఫీసు ప్రాంగణంలో కనిపించడం ఆసక్తి రేకెత్తించింది.అయితే వీరంతా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం హెలిప్యాడ్ వాడుకున్నట్లు తెలిసింది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రులంతా హెలికాప్టర్‌లో వెళ్లగా.. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా పిడుగు హరిప్రసాద్ జనసేన నేతలతో కలిసి తెలంగాణ మంత్రులకు స్వాగతం పలికారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

# భాగ్యనగరం... బాగుపడేదెప్పుడూ

హైదరాబాద్, ఆగస్టు 11,

అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది ''ఇంటికి సురక్షితంగా చేరతావో లేదో?'' అన్న ఆందోళన.భాగ్యనగరం (హైదరాబాద్) వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి. అరగంట వానకే రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి, మాన్‌హోల్స్ కనిపించకుండా పోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు గంటల తరబడి కొనసాగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్నా, దానికి శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు. ఈ దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి.. హైదరాబాద్ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా పాతది మరియు విస్తరిస్తున్న నగర అవసరాలకు సరిపోవడం లేదు. జనాభా పెరగడం, కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల నీటి మళ్లింపు సరిగ్గా జరగడం లేదు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా, వాటికి అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కాలక్రమేణా నాలాలు, చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగి, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. వర్షాకాలానికి ముందు డ్రెయినేజీ క్లీనింగ్, రోడ్ల మరమ్మతులు చేస్తామనే వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి, వరదలు సంభవిస్తున్నాయి.ప్రతి వర్షాకాలం భాగ్యనగరం మునిగిపోకుండా ఉండాలంటే తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలను అమలు చేయాలి. నగర జనాభా, విస్తరణకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడం, పాత వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం. నాలాలు, చెరువుల చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంది. భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాజెక్టులలో డ్రెయినేజీ, నీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా చేర్చాలి.భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే, ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం తప్పనిసరి. వర్షం అంటే భయం కాకుండా, ఆనందం కలిగించే రోజు రావాలంటే, ఈ సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనడం అవసరం. లేకపోతే, వర్షాకాలంలో నగర ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి.

నరకం చూపించిన వాన

హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా కురిసిన వానకు జన జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అడుగు కదలడానికి గంటలు పట్టింది. హైటెక్ సిటీ ప్రాంతంలో అయితే మరింత నరకప్రాయం. ఎక్కడికక్కడ అధికారులు వెంటనే వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ మాత్రం ముందుకు కదల్లేరు. అర్ధరాత్రి వరకు వాహనదారులు రోడ్లపైనే జాగారం చేశారు. హైటెక్ సిటీ నుంచి హయత్ నగర్ వరకు అటు గాజులరామారం వరకు ఇటు శంషాబాద్ వరకు ఎక్కడ చూసినా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓవైపు దంచి కొడుతున్న వాన మరోవైపు ముందుకు కదలని ట్రాఫిక్. నిజంగా ప్రయాణికులు బాధ వర్ణణాతీతం. రోడ్డుపై పారుతున్న వరద నీటిలో కొన్ని కార్లు కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రియల్ టైంలో పని చేసే అధికారులు కనిపించడం లేదని నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఆఫీస్ నుంచి వచ్చే వాళ్లది ఒక బాధ అయితే ఆఫీస్‌కు నైట్ షిఫ్టులకు వెళ్లే వాళ్లది మరో బాధ. షిఫ్టు టైం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫొటోలు క్లిక్ చేసి చలానాలు రాసే డిపార్ట్మెంట్‌గా ట్రాఫిక్ విభాగం పేరు తెచ్చుకుందే తప్ప రియల్ టైంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడుతున్నారు. ఇలా వర్షంలో చిక్కుకుపోతామని ఆఫీసుల్లోనే వాహనాలు వదిలి మెట్రోను ఆశ్రయించిన వారికి అక్కడ క్రౌడ్ చూసి బిత్తర పోయారు. అన్ని మెట్రో టెర్మినల్స్‌లో కూడా భారీ క్యూలు కనిపించాయి. వచ్చిన మెట్రోలు కిక్కిరిసిపోయాయి. ఏదోలా ఇంటికో ఆఫీస్‌కో చేరుకోవాలన్న ఆశతో నగరవాసులు మెట్రోలో ఇబ్బందిపడుతూనే ప్రయాణం చేశారు. కనీసం నిలబడేందుకు కూడా జాగా లేక సమస్యలు ఎదుర్కొన్నారు.ప్రైవేటు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించే వారిది మరో బాధ. క్యాబ్‌లు, ఆటోలు గంటల తరబడి బుక్ కాలేదు. అయినా కొందరు డ్రైవర్ల వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. రిజెక్టు కొట్టారు. ఇలా అన్ని వైపుల నుంచి నగర వాసులను వాన తెగ ఇబ్బంది పెట్టేసింది.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...

హైదరాబాద్, ఆగస్టు 11

కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉ ద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది.కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉ ద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది.డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది

.యూనివర్సిటీ నినాదం "ఇటబీఈజీబితినీని జీబి ఎనీబీతీ టనీనీతీబబివజూ"కు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు.ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. 40-23680333 / 040-23680555.. కాల్ సెంటర్ : 1800 5990 101 లేదా వెబ్ సైట్.. లిలిలి.ఎతీజీనీబీ.జీఞ.తిని । లిలిలి.నినిశ్రీతినివ.ఎతీజీనీబీ.జీఞ.తినిను సంప్రదించవచ్చు.

# నేనా... రిటైర్మెంటా...

హైదరాబాద్, ఆగస్టు 11,

ట్రెండ్‌కు అనుగుణంగా వెళ్లే నేతల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకరు. ట్రెండ్‌కు తగ్గట్టుగా మాటలు ఆడుతారు. తనపై మీడియాలో చర్చ జరిగేలా చేస్తారు. చివరకు తాను అలా అనలేదంటూ సెటైర్‌గా చెప్పడం వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు అదే చేశారాయన. తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన వ్యక్తుల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకరు. పాలు అమ్మిన దగ్గర నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన, వ్యాపారవేత్తగా రాణించారు. ఆ తర్వాత విద్యాసంస్థలను స్థాపించారు. చివరకు రాజకీయ నేతగా మారారు. ఆయన నెక్స్ట్ ఏంటన్నది ఎవరికీ తెలీదు. రాజకీయాలకు దూరంగా ఉంటానని శనివారం చెప్పారు. మరుసటి రోజు ఆదివారం నాటికి మాట మార్చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటారని అన్నారని, వారసత్వం ఏమైనా కొనసాగిస్తారా? అంటూ మీడియా లేవనెత్తిన ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు ఎమ్మెల్యే మల్లారెడ్డి. తాను దూరంగా ఉంటానని అనలేదని, స్పీడ్‌లో ఆ విధంగా మెసేజ్ జారి పోయిందన్నారు. ఓ జర్నలిస్ట్ అడిగి ప్రశ్నకు ఈ విధంగా సమాధానం ఇచ్చానని తెలిపారు. మీరు టీడీపీలోకి వెళ్తారా? బీజేపీలోకి వెళ్తారా? తాను దేశంలోకి వెళ్లనని చెప్పానని, శనివారం చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదన్నారు. విద్యాసంస్థలను దేశవ్యాప్తంగా ప్రారంభిస్తానని చెప్పానని తెలిపారు. జపాన్‌లో రిటైర్మెంట్ లేదని, తనకు రిటైర్మెంట్ లేదని చెప్పకనే చెప్పారు మల్లారెడ్డి. చివరకు తాను రాజకీయాల నుంచి తప్పుకునేది లేదని మనసులోని మాట బయటపెట్టారు మల్లారెడ్డి. ఆ రోజు ఏ పార్టీలో ఉంటానన్నది బయట పెట్టలేదు. బీఆర్ఎస్‌లో కంటిన్యూ అవుతారా? మరో పార్టీ వైపు చూస్తారా? అనేది చెప్పలేదు. టీడీపీ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి టీడీపీ ఎంపీగా గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత తెలంగాణలో మారిన రాజకీయాల నేపథ్యంలో బీఆర్ఎస్ వైపు వెళ్లారు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేశారు. ఆయన కున్న పాత పరిచయాలతో అన్నిపార్టీల అధినేతలతో టచ్‌లో ఉన్నారు. రేపటి రోజున పరిస్థితుల బట్టి మారిపోయే ఛాన్స్ లేకపోలేదు.

## నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

**డాక్టర్ వి విజయలక్ష్మి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ**



షాద్ నగర్,ఆగస్టు 11 (భారత శక్తి) :జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ డివిజన్లోని అన్ని గ్రామాలలో లోని 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ కూడా, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో అంగన్వాడి స్కూళ్లలో, జూనియర్ కాలేజీలలోని పిల్లలందరికీ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మాత్రలను మింగించే కార్యక్రమములో అందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని డాక్టర్ వి.విజయలక్ష్మి తెలియజేశారు. షాద్నగర్ డివిజన్లో 273 ప్రభుత్వ పాఠశాలలు, 87 ప్రైవేట్ పాఠశాలలు, 320 అంగన్వాడి స్కూళు 9 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలలోని మొత్తం 87642 మంది విద్యార్థులకు ఆల్బెండజోలు మాత్రలు వేస్తున్నామని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ ఆల్బెండజోళ్ళు మాత్రలు విద్యార్థులు వేసుకోవడం వలన వారి పేగులలో ఉన్న నులి పురుగులను నివారించడమే కాకుండా, విద్యార్థులలో రక్తహీనతను తగ్గించేందుకు,వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు దోహదపడతాయని, డాక్టర్ వి. విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా షాద్నగర్ డివిజన్లోని ప్రజలందరికీ తెలియ పరచడమేమనగా,1 నుండి 19 సంవత్సరంలో పిల్లలందరూ కూడా ఆల్బెండజోలు మాత్రలు మింగేటట్లుగా వారి యొక్క తల్లిదండ్రులు చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో 122 మంది వైద్య సిబ్బంది, 286 మంది ఆశాలు, 318 మంది అంగన్వాడీ టీచర్లు 360 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు.

## పాలేరు ప్రజలకు వరంలా సీఎంఆర్ఎఫ్ చెక్కులు- మంత్రి పొంగులేటి..



ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి )ఆగస్టు 11:పేదల కష్టాలు తీర్చడమే ప్రజా ప్రతినిధి నిజమైన ధర్మమని నమ్మే తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆ స్ఫూర్తిని మరోసారి ఆచరణలో చూపించారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు సోమవారం చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నెల పాలేరు నియోజకవర్గానికి చెందిన 400 మందికి పైగా లబ్ధిదారులకు రూ. ఒక కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి పొంగులేటి చొరవతో వస్తున్నాయన్నారు. అందులో భాగంగా భాగంగా ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 94మంది లబ్ధిదారులకు సుమారు రూ. 31 లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్తోందని ఆయన అన్నారు.సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందభాష్పాలు కమ్ముకున్నాయి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అండగా నిలిచిందని భావోద్వేగంతో తెలిపారు.

# ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా కృషి-

## డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు..







ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ) ఆగష్టు 11:ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి కృష్ణ, గోదావరి జలాలను వినియోగించుకుంటూ సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు :మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు రూ 630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాగార్జునసాగర్ 3వ జోన్ లో ఉన్న ఆయకట్టుకు రెండవ జోన్ నుంచి సాగు నీరు అందించాలని, ఈ ప్రాంత ప్రజలు కొన్ని దశాబ్దాలుగా పాలకులకు అనేక సార్లు విజ్ఞప్తి చేశారని అన్నారు. మధిర ప్రాంతంలో కట్టలేరు, వైరా, మున్నేరు నదులు ప్రవహిస్తున్నా నీరు మనకు అందలేదని అన్నారు.కట్టలేరు ప్రాజెక్టు ఆధునికరణ పూర్తి చేశామని అన్నారు. 2012 ప్రాంతంలో జవహర్ ఎత్తిపోతల పథకానికి మంజూరు ప్రతిపాదనలు సమర్పించామని, గత పాలకులు 10 సంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురి చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వం దృష్టికి ఈ ప్రాజెక్టు తీసుకుని వచ్చి, సర్వే నిర్వహించి, నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.మధిర ప్రాంతంలో అధికంగా వ్యవసాయంపై ప్రజలు ఆధారపడి ఉన్నారని, నీటిని సద్వినియోగం చేసుకుంటేనే ఇక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. చిరకాలం గుర్తుండే అద్భుతమైన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారానే పంటలు పండుతున్నాయని అన్నారు. ప్రతి రోజూ 11 టీఎంసీల నీరు ఆంధ్రప్రదేశ్ తీసుకునేలా పనులు చేస్తుందని, ఈ దోపిడి ఇలాగే కొనసాగితే 20 రోజులలో శ్రీశైలం ఖాళీ అవుతుందని, నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు సాగు నీరు అందేలా పోరాటాలు కొనసాగించాలని అన్నారు.జలవనరుల శాఖ నుంచి కోర్టు వరకు అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ రాయలసీమ ప్రాజెక్టులు, బనకచర్ల ప్రాజెక్టు అడ్డుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 7 మండలాలను ఏపి కు కట్టబెట్టడం అన్యాయమని అన్నారు.బనకచర్ల ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత, వరద జిల్లాలో మన హక్కు తేలిన తర్వాతే కింది రాష్ట్రాలు ప్రాజెక్టుల గురించి ఆలోచించాలని ఆయన అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ, గత పది సంవత్సరాల పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను గత పాలకులు మోసం చేశారని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తున్నామని అన్నారు. వరి పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు.దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా మన రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని బియ్యం గా మార్చి పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. వైద్య , విద్యా, వ్యవసాయ రంగాలలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు.తక్కువ ఖర్చు రూ 630 కోట్లతో 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసే దిశగా జవహర్ ఎత్తిపోతల పథకం ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. పేదల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బలోపేతం చేయాలని ఆయన కోరారు.నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఖమ్మం ప్రాంతంతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అన్నారు. మధిర ప్రాంతానికి గేమ్ చేంజర్ గా జవహర్ ఎత్తిపోతల పథకం ఉంటుందని అన్నారు.రూ 630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులను సంవత్సరం లోపు పూర్తి చేయాలని మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, వైరా నదిలో 120 రోజులలో 4 టీఎంసీలు ఎత్తిపోసెలా ఈ ప్రాజెక్టు రూప కల్పన చేశామని, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 190 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని దీనికోసం ప్రత్యేకంగా రూ 45 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మధిర మండలంలో 13 వేల ఎకరాల, ఎర్రుపాలెం మండలంలో 19 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు.గత పాలకులు చేసిన అస్తవ్యస్త పాలన కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చితికి పోయిందని, అటువంటి సమయంలో ఆర్థిక శాఖ, విద్యుత్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ సీఎం అద్భుతంగా పనిచేస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ పేదల సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని, అదే సమయంలో పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పుష్కలంగా గోదావరి నది జలాలు తీసుకొని వస్తామని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకంగా పనిచేస్తుందని, గోదావరి నది బోర్డు నుంచి సిడబ్ల్యుసి వరకు ప్రతి దశలో ఆ ప్రాజెక్టను అడ్డుకుంటామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో గత పాలకులు చేసిన అవినీతి కారణంగానే ఆ ప్రాజెక్టు కూలిపోయిందని జస్టిస్ కమిషన్ రిపోర్ట్ అందించిందని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, దిండి, సీతారామ, పాలమూరు, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ప్రతి అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు. భూ భారతితో పేద రైతులకు న్యాయం చేశామన్నారు. రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. రూ. 1200 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వంగవీడుకు డబల్ రోడ్ వేస్తామన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, జోన్ 3 లో ఉన్న బ్రాంచీ కేనాల్ మీద మధిర, ఎర్రుపాలెంలో 33 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా నీరు సరిగ్గా అందక రైతులు అనేక ఇబ్బందులకు గురి అయ్యారని తెలిపారు. 630 కోట్ల 30 లక్షల రూపాయలను ఖర్చు చేసి జవహర్ ఎత్తిపోతల పథకం నిర్మించడం ద్వారా ఆంధ్ర తో సంబంధం లేకుండా జోన్ 3 ఆయకట్టు జోన్ 2 పరిధిలోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు.గోదావరి నీటిని పాలేరు తీసుకొని వచ్చి కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న 33 వేల ఎకరాల రెండు పంటలు పండుతూ సస్యశ్యామలంగా పండించడం కోసం ఈ స్కీం ఉపయోగపడుతుందని అన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణం, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, ఉగాది నుండి రేషన్ కార్డు ద్వారా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.మొదటి విడత కింద 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేశామని, రాబోయే 3 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేదవాడికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు అందుతుందని అన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా డబ్బులు పడుతున్నాయని అన్నారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, ఇర్రిగేషన్ సీఈ రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఈసీ ఓట్ల దొంగతనం ప్రజాస్వామ్యానికి అవమానం : డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు..






కామారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 11: కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కైలాస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ,ఏడవ తారీఖున రాహుల్ గాంధీ ప్రెస్ మీట్ పెట్టి ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో పటిష్టమైన ఆధారాలతో కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. ఈసీ బీజేపీ రెండు ఒకటే అని నిరూపించారు. మోడీ ప్రధాని పీఠంపై దొడ్డి దారిన కూర్చున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఎలక్షన్ కమిషన్ కళ్ళు తెరిచి, ఓటరు జాబితాను నిష్పక్షపాతంగా వ్యవహరించి, తప్పులను సరిదిద్ది, ప్రజాస్వామ్యానికి క్షమాపణ చెప్పాలని,ఈసీకి ఎవరైనా తమ అనుమానాలను అడిగితే వారిని బెదిరించే ధోరణి మానుకోవాలని, బీహార్ ఎన్నికలు బ్యాలెట్ తో నిర్వహించి, ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలని,దీంతో బిజెపి అసలు రంగు బయటపడుతుందని ఆయన అన్నారు.ఇప్పటికైనా తప్పు తెలుసుకొని సరిదిద్దుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా, గ్రామాల వరకు,నిరసన కార్యక్రమాలు చేపట్టి తమ పోరాటం కోన సాగిస్తాం, అయినా ఇలాగే కొనసాగితే ఎన్నికలు బహిష్కరించే రోజులు కూడా వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పండ్లరాజు, గోనె శ్రీనివాస్ , గుడుగుల, శ్రీనివాస్, పాత శివ కృష్ణమూర్తి, రాజా గౌడ్, ఐరేని సందీప్, పంపరీ లక్ష్మణ్, లక్ష్మీరాజ్యం, మసూద్, రాంకుమార్ గౌడ్, సర్వర్, జమీల్, సిద్దిక్ , సిరాజ్,భాస్కర్, దోమకొండ శ్రీనివాస్, లక్క పతిని గంగాధర్, కిరణ్, కస్తూరి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## అనర్హులను తొలగించి అర్హులకు డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలి..





కామారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 11: కామారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీలు అనర్హులకు కేటాయించారని అన్నారు.ప్రధానంగా బిక్నూర్ మండల కేంద్రంలో జరిగిన ఇండ్ల పంపిణీలో అనర్హులు ఉన్నారని, అధికారులు,రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ,అర్హులకు కేటాయించకుండా అనర్హులకు ఇండ్లు కేటాయించారని, సోమవారం జిల్లా కలెక్టర్ కి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించిన కలెక్టర్ హౌసింగ్ జిల్లా అధికారిని వెంటనే రీ ఎంక్వయిరీ చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ఏ విధంగా జరిగిందో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. బిక్నూర్ గ్రామస్తులు ఇండ్లు లేనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇళ్ల స్థలాల కోసం ఆందోళన పోరాటాలు కొనసాగించాలని, అర్హులకు ఇవ్వకుండా ఇండ్లున్నవారికి, ఉద్యోగులకు కేటాయించడం సరైంది కాదన్నారు. ప్రస్తుత కామారెడ్డి ఎమ్మెల్యే సైతం అభ్యంతరం తెలిపినట్టు ఆయన గుర్తు చేశారు. అర్హులైన పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు ఆందోళన,పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు, నాయకులు రహిమా, హైమా, బేగం, పుష్ప, మంజుల, భాష, లక్ష్మి, నజియా, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ గృహ విద్యార్థులకు రూ. లక్ష విలువైన వస్తువుల విరాళం..




ఎల్బీనగర్, ఆగష్టు 11 (భారత శక్తి):ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహంలో మలక్పేట్ ం సత్యశక్తి మహిళా శాఖా కమిటీ సభ్యులు రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విద్యార్థులకు అందరికీ రాఖీలు కట్టి, రూ.లక్ష విలువ గల 110 స్కూల్/ కాలేజీ బ్యాగ్స్, 110 గొడుగులు, 110 లంచ్ బాక్సులు,అందరికీ సబ్బులు,రక రకాల స్నాక్స్ కిట్స్ మొదలగునవి అందచేశారు. ఈ సందర్భంగా అగర్వాల్ సమాజ్ సెంట్రల్ కమిటీ సెక్రటరీ డా. సీమా జైన్ మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని కమిటీ వారు పిల్లలను చేరదీసి వారికి భోజన, వసతి, విద్యా, వైద్య సకల సౌకర్యాలు కల్పి%శీ%చి, వారి భవిష్యత్తుకు నిరంతరంగా కృషి చేస్తున్న గృహ కమిటీని అభినందించారు. ఇలాంటి గృహములో మలక్పేట్ సత్యశక్తి మహిళా శాఖా కమిటీ సభ్యులు గత 16 సంవత్సరాల నుండి రాఖీ పండుగ వేడుకలు నిర్వహిస్తూ, విద్యార్థులకు అవసరమైన బట్టలు, పుస్తకాలు, రేషన్ అందిస్తున్న%శీ%దుకు మహిళా శాఖను అభినందించారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ కోశాధికారి అంచల్ గుప్తా, మలక్పేట్ శాఖ ప్రెసిడెంట్ రాణి మిట్టల్, సెక్రటరీ నీతి అగర్వాల్, పుష్ప అగర్వాల్, కాంతా బన్సల్, మీనా అగర్వాల్ పెద్ద ఎత్తున మహిళా సభ్యులు హాజరయ్యారు. గృహ విద్యార్థులకు అవసరమైన ఒక లక్ష రూపాయల విలువ గల చాలా వస్తువులు అందచేసిన సత్యశక్తి మహిళా శాఖా సభ్యులకు గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల భైంసాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ..



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో,(భారత శక్తి)ఆగస్టు 11:నిర్మల్ జిల్లా, భైంసా లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నులి పురుగుల నివారణ కోసం గవర్నమెంట్ జూనియర్ కళాశాల భైంసాలో, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమైనది. ప్రభుత్వ సహకారంతో అలాంటి ఆరోగ్య కార్యక్రమాలను మా కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరి ప్రసాద్, రజినీకాంత్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో,ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మంచి స్పందన కనిపించింది.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)ఆగస్టు 11 :ప్రజా సమస్యలకు సంబంధించిన, దరఖాస్తులను సత్వరవే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈరోజు మొత్తం 40 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. అందిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... ప్రజావాణి లో అందిన ప్రతీ దరఖాస్తుపై రికార్డు నిర్వహణ చేపట్టి ,ప్రతి ఫిర్యాదు పరిష్కారం అయ్యేవరకు ఫాలోఅప్ చేయాలి అని తెలిపారు. ప్రజల సమస్యలను వినడమే కాకుండా,వాటి పరిష్కారం కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు .

## ఎస్ఎన్డిపి నాలాలకు నిధులు ఇవ్వడంలో సర్కార్ విఫలం-ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



ఎల్బీనగర్, ఆగస్టు 11(భారత శక్తి) :ప్రభుత్వం వరద కాలువ పనులకు నిధులు ఇవ్వకపోవడంతోనే,సమస్యలు మరోసారి ఉత్పన్నమవుతున్నాయని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నాలాలకు నిధులు మంజూరు చేయాలని, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారంమహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలా నగర్ వరద ముంపుకు గురి కావడంతో సబితా ఇంద్రారెడ్డి కాలనీలలో పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలనీలో నీరు నిలిచిపోయి, ఇళ్లలోకి చేరింది. ఈ సమస్యపై కాలనీవాసులు తమ ఆవేదన సబితా ఇంద్రారెడ్డికి తెలియజేశారు. ఈప్రాంత పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మదారి రమేష్, అనిల్ యాదవ్, దీప్ లాల్ చౌహాన్, కాలనీ వాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం-జిల్లా కలెక్టర్ ప్రావిణ్య..




సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 11:ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే) ను పురస్కరించుకొని, పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమంకు జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ (నేషనల్ డి వార్మింగ్ డే) కార్యక్రమానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు . నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలలో ఎన్నోసమస్యలుతలెత్తుతాయన్నారు.నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 11వ తేదీన ( నేషనల్ డి వార్మింగ్ డే) ను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒక సంవత్సరం వయసు నుండి 19సం వయసులోపు వారందరికీ నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఈరోజు ఆగస్టు 11 జిల్లాలోని అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఒకటి నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలకు, సగం మాత్రను చూర్ణం చేసి నీటిలో గాని, పాలలో గాని కలిపి మాత్రలు వేసుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మూడు సంవత్సరాల వారికి ఒక మాత్ర చూర్ణం చేసి నీటిలో కలిపి ఇచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు . ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ వైద్యుల పర్యవేక్షణలోనే ఈరోజు మాత్రలు వేయనునట్లు తెలిపారు . నులిపురుల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయని,వాటి నివారణ కోసం, తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. నులిపురుగుల సమస్య కారణంగా ఆహారం ఎంత తీసుకున్నప్పటికీ బరువు పెరగకపోవడం లాంటి సమస్యలు అనేకం తలుస్తుతాయన్నారు. ఈ సమస్యల నివారణ కోస%శీ% పరిశుభ్రత చర్యలు పాటించడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడం,

అన్నం తినే ముందు కాళ్లు చేతులు, శుభ్రంగా కడుక్కోవడం లాంటివి చర్యలు చేపట్టాలన్నారు. నులిపురుగుల నివారణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగులను నివారించవచ్చు అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వైద్యులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే వేసుకోవాలని ఇంటికి తీసుకెళ్తాం అని అనకుండా వైద్యుల పర్యవేక్షణలో వేసుకోవడం మంచిదన్నారు. ఈరోజు తప్పిపోయిన పిల్లలకు రేపటినుండి 19వ తేదీ వరకు అంగన్వాడి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇల్లు తిరిగి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం బోదకాలు నివారణ, డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇచ్చే మాత్రలను ప్రతి ఒక్కరు వేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి నాగ నిర్మల , ఉపాధ్యాయులు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

# కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ జర్నల్ లో గీతం అధ్యాపకుల పరిశోధనా వ్యాసం ప్రచురణ..





సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 11:గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం (ఈఈసీఈ) అధ్యాపకులు వి. శివప్రసాద్, ప్రొఫెసర్ కె. మంజునాథాచారి సంయుక్తంగా రచించిన పరిశోధనా వ్యాసం,ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ యొక్క ప్రఖ్యాత పీర్-రివ్యూడ్ జర్నల్- ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మైక్రోవేవ్ అండ్ వైర్ లెస్ టెక్నాలజీలో ప్రచురితమైనట్టు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రిపుల్ బ్యాండ్ సర్క్యులర్ క్వార్టర్ మోడ్ సబ్ స్ట్రేట్ ఇంటిగ్రేటెడ్ వేవ్ గైడ్ (యు ఎం ఎస్ ఐ డబ్ల్యూ) 1ఐ2 ( ఎం ఐ ఎం వో) యాంటెన్నా రూపకల్పన, విశ్లేషణ పేరిట వారు వెలువరించిన పరిశోధనా వ్యాసంకు ఈ ఘనత దక్కించుకున్నట్టు తెలియజేశారు. గీతం, కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ మధ్య ట్రాన్స్ ఫార్మేటివ్ ఒప్పందం కింద శివప్రసాద్ తొలిసారి వంద శాతం వ్యాస ప్రచురణ రుసుము (ఆర్టికల్ ప్రాసెసింగ్ ఛార్జ %-% ఏపీసీ) మినహాయింపును పొందినట్టు వివరించారు. ఈ పరిశోధనా పత్రం గోల్డ్ ఓపెన్ యాక్సెస్ కింద ప్రచురితమైనందున, ప్రపంచ వ్యాప్త పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలకు అందుబాటులో ఉందని పేర్కొన్నారు.దీనిపై వ్యాస రచయితల్లో ఒకరైన శివప్రసాద్ స్పందిస్తూ..ఈ అవకాశం మా అధ్యయనాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులతో పంచుకోవడానికి, ఆవిష్కరణలను వేగవంతం చేయడంలో ఓపెన్ యాక్సెస్ విలువను బలోపేతం చేయడానికి వీలు కల్పించింది అని వ్యాఖ్యానించారన్నారు. ఈ పరిశోధన మైక్రోవేవ్, వైర్ లెస్ టెక్నాలజీలలో పురోగతికి దోహదపడుతుందని, అత్యాధునిక పరిశోధన, అంతర్జాతీయ విద్యా సహకారానికి గీతం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు.విశ్వ యవనికపై గీతం బావుటా ఎగురవేసిన ఈ ఇద్దరు అధ్యాపకులను గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. సీతారామయ్య, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. మాధవి, పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది అభినందించినట్టు పేర్కొన్నారు.

# అల్ఫోర్స్ టైనీ టాట్స్ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ..

కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (భారత శక్తి):విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ఆరోగ్యం యొక్క విశిష్టతను తెలియపరచవలసిన అవసరం ఎంతగానో ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వావిలాల పల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు నిర్వహించినటువంటి నులిపురుగుల నివారణ మాతల పంపిణీ చేసినారు.విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, వారికి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చడం ఈ కాలంలో ఒక గొప్ప సవాలుగా మారినదని వారు తెలిపారు.

విద్యార్థుల్లో పౌష్టికర ఆహారం పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని, తద్వారా చదువు పట్ల ఆసక్తి కనబరచడమే కాకుండా అందులో రాణించడం సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అవగాహన లేమి వలన, రోగాల బారిన పడటం చాలా విచారకరమని,ఇటువంటి సందర్భాల్లో తప్పనిసరిగా ప్రభుత్వంతో సమన్వయపరిచి విస్తృతంగా అవగాహన కల్పించాలని వారు కోరారు.



ఈ మాత్రల ద్వారా విద్యార్థులకు శరీరం యొక్క రోగ నిరోధక వ్యవస్థను విస్తరింప చేయవచ్చని మరియు అంటువ్యాధులను చికిత్స చేయడానికి ఉపయోగపడతాయని వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం చాలా హర్షించదగ్గ విషయమని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి పిల్లల యొక్క ఆరోగ్యం పట్ల దృష్టి సారింప చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని గుర్తు చేస్తూ, ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఎస్బిఐ ఆరోగ్య బీమా కార్యాలయం ప్రారంభం



నిర్మల్, (భారత శక్తి )ఆగస్ట్ 11: నిర్మల్ పట్టణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) తన ఆరోగ్య బీమా కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. ఈ కార్యాలయం ప్రారంభంతో ప్రజలకు ఆరోగ్య బీమా సంబంధిత సేవలు మరింత చేరువ కానున్నాయి. ఈ సందర్భంగా ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ ద్యావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్య బీమా అవసరం రోజురోజుకీ పెరుగుతున్న తరుణంలో ఈ కార్యాలయం ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది అని అన్నారు. ఆరోగ్య భద్రత కోసం ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిర్మల్ పట్టణంతో పాటు, పరిసర మండలాల ప్రజలకూ ఈ కార్యాలయం సేవలందించనుందని మేనేజర్ వివరించారు. బ్యాంకులో అందుబాటులో ఉన్న వివిధ ఆరోగ్య బీమా స్కీముల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తాం..



కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 11(భారత శక్తి):పకడ్బందీ ప్రణాళికతో కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఒక మాడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణం, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఆధునీకరణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ 4.79 కోట్లతో మౌలిక వసతుల కల్పన.. ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. నాలుగు కోట్లతో సుడా వాణిజ్య భవన నిర్మాణాన్ని చేపడుతు న్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు కోట్లు మంజూరు అయ్యాయనీ, వాటితో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పనులు రూ 79 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు నాణ్యతతో చేపట్టేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని సూచించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో మిగిలిపోయిన పనులకు ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామనీ, ఆ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. అదేవిధంగా కరీంనగర్ కు తలమానికంగా నిలిచే మానేర్ రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ శాతవాహన యునివర్సిటీ లో తాము ఏర్పాటు చేసిన గ్రూపులతోనే యూనివర్సిటీ రన్ అయిందనీ, తమ ప్రభుత్వం వచ్చాక శాతవాహన యూనివర్శిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, ఆర్డీవో మహేశ్వర్ , మా జీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, మృత్యుంజయం, జిల్లా అధికారులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా రెన్యువల్ చివరి తేది ఆగస్టు 14

జయశంకర్ భూపాలపల్లి, రైతు కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడం ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం రెన్యూవల్ ప్రక్రియ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతుంది 2018 ఆగస్టు 15 నుంచి అమల్లో అమల్లోకి వచ్చింది ఈ పథకంలో 18 నుండి 59 ఏళ్ల వయసుగల పట్టాదార్ పాస్ బుక్ కలిగిన సాగు రైతులు అర్హులు ప్రమాదం అనారోగ్యం లేదా ఇతర కారణాలవల్ల రైతులు మరణించిన పక్షంలో నామినికి ఎల్ఐసి ద్వారా ఐదు లక్షలు ఒకేసారి అందజేస్తారు ప్రీమియం మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వం భరిస్తుంది

# జర్నలిస్టులు ప్రశ్నిస్తే చంపుతారా!!?



పోరుమామిల్ల, (భారత శక్తి ప్రతినిధి ) ఆగస్టు 11: పేద బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్నటువంటి జర్నలిస్టులను చంపుతామని బెదిరిస్తున్నటువంటి కత్తెర గండ్ల పంచాయతీ సర్పంచ్ భర్త చెన్ను పల్లె వెంకట రెడ్డి మరియు భాస్కర్ రెడ్డి లు ఇద్దరు కలిసి పుల్లూరు మహబూబ్ భాషా ను చంపుతామని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ ఏకమై నరసాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.దీనిపై వెంటనే పై అధికారులు స్పందించి పుల్లూరు మహబూబ్ భాషాకు న్యాయం చేసి, వారిపైన చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా పుల్లూరు మహబూబ్ భాషా కత్తెరగండ్ల పంచాయతీలోని చెన్నవరం గ్రామంలో దూదేకుల స్మశాన వాటిక గురించి 1993లో ఎకరా స్థలం దూదేకుల స్మశానానికి గ్రామకంఠంలో కేటాయించారు. దానిని ప్రస్తుతం సర్పంచి మరియు వారి బంధుమిత్రులు కలిసి ఆక్రమణ చేసి ప్రస్తుతం 10 సెంట్లు మాత్రమే ఉండేటట్లు చేశారు, చంపుతామని ఊరంతా కేకలేస్తూ చెబుతున్నారు, అంతేకాకుండా చెన్నకేశవ స్వామి గుడి దగ్గర నుండి శివాలయం గుడి వరకు రోడ్డు, పూర్వం ఎప్పుడో విడగొట్టిన రోడ్డును ఇప్పుడు సర్పంచ్ వాళ్ళు,వాళ్ళ బంధుమిత్రులు అడ్డుకుంటున్నారు.దీనిపైన కూడా వార్త రాశారని అందు వల్ల పులూరు మహబూబ్ భాషా ను చంపుతామని, అంతే కాకుండా పంచాయితీ నిధులలో రూ 5000000( అక్షరాల 50 లక్షల రూపాయలు) నిధులు దుర్వినియోగం అయ్యాయని వార్త రాశాడని, ప్రతిదానికి ఊరిలో మేము చేసే మోసాలకు అడ్డం వస్తున్నాడు, అందువల్ల పుల్లూరు మహబూబ్ భాషా చంపి వేస్తే బాగుంటుందని ఊరు ఊరంతా తిరిగి ప్రచారం చేస్తున్నారు,అందువల్ల నిన్నటి దినం అనగా ఆదివారం నరసాపురం స్టేషన్లో పుల్లూరు భాష రక్షణ కోసం లిఖితపూర్వకంగా ఏఎస్ఐ రమణ కు మరియు పోరమామిళ్ళకు వచ్చిన డిఎస్పి రాజేంద్రప్రసాద్ కు వినతి పత్రం ఇచ్చి మహబూబ్ బాషా గోడు వెల్లవించుకోవడం జరిగింది.దీనిపై స్పందించి డిఎస్పీ వెంటనే పుల్లూరు భాషకు ప్రొటెక్షన్ కల్పించండి అని ఎస్ఐ కి చెప్పడం జరిగింది. కానీ ఇంతవరకు కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు, అది ఏమని ఏఎస్ఐ రమణాను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ నరసాపురం పోలీస్ స్టేషన్కు పోయి, ఆదివారం ఇచ్చిన కంప్లైంటును ఏమి చేశారని అడగగా నా పై ఆఫీసర్లు కు చెప్తానని, వాళ్లు ఏ నిర్ణయం తీసుకుంటే అది నా నిర్ణయం అని చెప్పాడు. దీనిపైన ఇప్పటికైనా కడప జిల్లా ఎస్పీ స్పందించి పుల్లూరు భాషకు న్యాయం చేస్తారని జర్నలిస్టులందరూ కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు భాస్కర్, ప్రగతి శీను, కమల్, ఓబయ్య ,ఉపేంద్ర, ప్రింట్ మీడియా విలేకరులు సాల్మన్ ,వెంకట్ రెడ్డి, దాదా పీర్, మనోహర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి మరియు వ్యవసాయ కార్మిక సంఘం కాశీనాయన మండలం అధ్యక్షుడు పోలయ్య తదితరులు పాల్గొన్నారు

# అలసత్వం వద్దు అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు11 (భారత శక్తి ): ప్రజల సమస్యలే పరిష్కారకంగా తీసుకున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా,వచ్చిన బాధితుల సమస్యలపై అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని,ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయని అందులో రెవెన్యూ శాఖకు 36, గృహ నిర్మాణ శాఖకు 26, డీఆర్డీఏ 20, ఉపాధి కల్పన శాఖకు 7, పంచాయితీ, సంక్షేమ శాఖలకు 5 చొప్పున, పౌర సరఫరాల శాఖకు 4, సెస్ కు 3, ఎస్డీసీ, మున్సిపల్ కమీషనర్ సిరిసిల్ల కు 2 చొప్పున, వ్యవసాయ, వైద్యారోగ్య, విద్యా శాఖ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో చదువుతోపాటు ఆటలు ముఖ్యం..

పోరుమామిళ్ల, (భారత శక్తి ప్రతినిధి ) ఆగస్టు 11: పోరుమామిళ్ల మండలం అక్కల్ రెడ్డి పల్లె గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు విద్యనభ్యసించి మంచి స్థాయిలో ఉండగలిగిన సిద్దిపేట లయన్స్ క్లబ్ నెంబర్ దాసరిపల్లి జోజి (ఎక్స్ ఆర్మీ)(జ్యోతి మన వికాస కేంద్రం సిద్దిపేట) మరియు బద్వేల్ ఎంఈఓ ప్రమీల, కాకినాడ ఎంఈఓ దాసరపల్లి డేవిడ్,చాపాడు జడ్పీ హైస్కూల్ పీడీ ఓబయ్య వారి ఆధ్వర్యంలో, విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వానికి ఆటవిడుపు ముఖ్యంగా భావించి, ఆట వస్తువు లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గురయ్య , బాల చెన్నయ్య లు మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు జరగాలని, ఇటువంటి కార్యక్రమాలకు పూర్వ విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు, గ్రామాలలోని ఉద్యోగులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా దాతలు జోజి, డేవిడ్, ప్రమీల, ఓబయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధనలు ఉన్నాయని, గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను గ్రామాల పెద్ద మనుషులు, చిన్న మనషులు, పిల్లల తల్లిదండ్రులు అభివృద్ధి పరచుకోవాలని, ప్రతి ఇంట్లో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని, ప్రభుత్వ సౌకర్యాలను అనుభవించాలని,



విద్యార్థులు, తల్లిదండ్రులకు గుర్తు చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులు నవోదయ క్లాసులో బోధించే విషయంలో తగిన మెటీరియల్ అందించగలమని వారు తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమం మరెన్నో జరుపుకోవాలని,ప్రభుత్వ పాఠశాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆశ భావం వ్యక్తం చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు ఆట వస్తువులను బహుకరించిన జోజి, డేవిడ్, ప్రమీల, ఓబయ్య, లకు మరియు నూతనంగా వచ్చి పాఠశాల అభివృద్ధిలో అత్యధికంగా పాటుపడుతున్న ఉపాధ్యాయులకు, గ్రామ పెద్దమనుషులు,పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ ,వైస్ చైర్మన్ రామయ్యలు గ్రామ పెద్దలు బాలస్వామి, సాల్మన్, బాలకరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదలకు ఇచ్చిన నోటీసులను వాపస్ తీసుకోవాలి..



కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (భారత శక్తి):లోయర్ మానేర్ కింద ఉన్న హస్నాపురం కాలనీ పేదలకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఆధ్వర్యంలో, సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి హస్నాపూర్ లో అన్ని విధాల ప్రభుత్వ అనుమతులు పొంది, స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పేదల ఇండ్లను ఎందుకు కూల్చి వేస్తారని ప్రశ్నించారు.గతంలో ఎస్సారెస్పీ డ్యామ్ లో భూములు కోల్పోయిన వారికి, ప్రభుత్వమే పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇచ్చిందని, మున్సిపల్ అనుమతులతో అన్ని రకాల పన్నులు చెల్లిస్తూ పేదలు జీవిస్తున్నారని, అటువంటివారిని ఇండ్లు ఖాళీ చేయాలని, లేదంటే కూల్చివేస్తామని డ్యామ్ సేఫ్టీ అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు.పేదల ఇంటి ఒక్క ఇటుక కూల్చిన సిపిఎం ఆధ్వర్యంలో బుల్డోజర్లకు అడ్డుపడి పేదల ఇండ్లను రక్షిస్తామని అన్నారు.గత పాలకులు అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ఒక్క ఇల్లు ఇవ్వకపోగా, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, ప్రజల పాలన అంటూ పేదలను మోసం చేస్తున్నారని, పేదలకు ఇండ్లు ఇవ్వకపోగా ఉన్న ఇండ్లనే కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బి ఆర్ ఎస్ పైన కాంగ్రెస్, కాంగ్రెస్ ప్రభుత్వం పైన బిఆర్ఎస్ ఆరోపణలు చేసుకుంటూ పేదలను వంచిస్తున్నాయని అన్నారు. బిజెపి నాయకులు కలెక్టర్ ఎదుట ధర్నాకు సిద్ధమైన పేదలను, తమ పరువు ఎక్కడ పోతుందోనని అడ్డుకున్నారని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, పైరవీలు, సంప్రదింపులతో పేదలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. పేదల పక్షాన నోటీసులు ఉపసంహరించుకునే వరకు దశలవారీగా సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.ప్రభుత్వ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ బకాసురులు దర్జాగా కబ్జాలు చేస్తూ అపార్ట్మెంట్లు కడుతుంటే చూస్తూ ఊరుకుంటున్న అధికారులు, పేదల ఇండ్లను మాత్రం కూల్చడానికి ఉత్సాహం చూపుతున్నారని మండిపడ్డారు. హస్నాపురం లోని పేదల ఒక్క ఇల్లును కూల్చిన సిపిఎం ఆధ్వర్యంలో అడ్డుకొని పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో నాయకులు గజ్జల శ్రీకాంత్, వినయ్, సందేశ్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములకు హక్కులు కల్పించాలి..

కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (భారత శక్తి):తాత ముత్తాతల నుండి సాగు చేసుకుంటున్న భూములకు,యాజమాన్య హక్కులు కల్పించాలని, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కొమరం భీమ్ జిల్లా చింతమానే పల్లి మండలం, దిండా గ్రామస్తులు చలో హైదరాబాద్ పేరిట ఈనెల 6 నుండి పాదయాత్ర చేస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణ కాలనీ కి చేరుకున్నారు. సుమారు 45 మందికి రాత్రి పూట బస తో పాటుగా భోజన వసతులు ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న వారికి ఎటువంటి ఇబ్బంది జరిగినా ప్రభుత్వమే భాధ్యత వహించాలని డిమాండ్ చేసారు. పోడు భూముల సాగు విషయంలో అటవీ అధికారులతో వారి కుటుంబాలకు ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఏడుస్తూ పేర్కొన్నారు.బిసి కులానికి చెందిన తామంతా నలభై ఏళ్లుగా వ్యవసాయం పైనే ఆదారపడి బతుకుతున్నామని తెలిపారు. వ్యవసాయం తప్ప వేరే ఎటువంటి పనులు రావని ఆవేదన వ్యక్తం చేసారు. కృరా, మృగాలకు ఇచ్చే ప్రాముఖ్యత కూడా తమలాంటి వారికి ఎందుకు ఇవ్వడం లేదని కన్నీరు,మున్నీరుగా విలపించారు.పిల్లలను, ముసలివాళ్ళను ఇండ్లల్లో ఉంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసుటకు సిద్ధమయ్యా మని తెలిపారు.వర్షం లో తడుస్తూ,ఎండకు ఎండుతూ కాళ్ళ కు బొబ్బలు వస్తున్నా కూడా పాదయాత్ర పై వెనుకడుగు వేయబోయమని పేర్కొన్నారు.దిండా గ్రామం లో పోడు భూములను





సాగు చేసుకుంటున్న బిసి లకే అటవీ అధికారుల వల్ల సమస్యలు వస్తున్నాయని తెలిపారు.పాదయాత్ర చేస్తున్న వారి కి కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, స్థానిక బీజేపీ నాయకులు,ఆవుల వేణు యాదవ్, కోతి రాజు,ఎడ్ల భూరెడ్డి,వేల్పుల ఓదయ్య,దుర్గంటి శేఖర్ రెడ్డి,సిద్ద శ్రీనివాస్,ఆవుల మల్లేశం,బోళ్ల శంకర్ తో పాటుగా గ్రామస్తులు సంఘీంభావం ప్రకటించారు.న్యాయపరమైన డిమాండ్ తో చేస్తున్న పాదయాత్ర పై ప్రభుత్వం వెంటనే స్పందించి భూములకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకునేలా పాదయాత్ర సంకల్పం నెరవేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న వారికి మానవతా దృక్పధం తో తగిన ఏర్పాట్లు చేసినటువంటి సహాయక చర్యలపై తెలుసుకున్నటువంటి సిర్ పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయ్ హరీష్ బీజేపీ అధ్యక్షులు జగదీశ్వరాచారి కి ఫోన్ ద్వారా ధన్యవాదములు తెలిపారని పాదయాత్ర చేస్తున్నవారు తెలిపారు.

# హైడ్రాలో ఎవరి జీతాలు తగ్గవు...గతంలో ఉన్న జీతాలే చెల్లిస్తాం-హైడ్రా కమిషనర్..



హైదరాబాద్, ఆగస్టు 11(భారత శక్తి):హైడ్రాలో పని చేస్తున్న సిబ్బంది ఎవరి జీతాలు తగ్గవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని రాత్రీ పగలూ పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉందని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను రెగ్యులరైజ్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో, హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ కొంతమంది అనవసరమైన ఆందోళన చెందారని అన్నారు. సమాచార లోపంతో ఈ జీవో ప్రకారం జీతాలు తగ్గుతాయేమోనని కొంతమంది ఆందోళన చెందారని,సోమవారం వారితో మాట్లాడి,అనుమానాలను నివృత్తి చేశామని ఎట్టి పరిస్థితుల్లోనూ జీతాలు తగ్గవని గతంలో ఉన్న జీతాలే వారికి చెల్లించడం జరుగుతోందని స్పష్టం చేశారు. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్ ఆందోళన చేస్తున్నారని.. విధులకు గైర్హాజర్ అయ్యారు.., హైడ్రా కార్యక్రమాలు ఆగిపోయాయి అని ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో కమిషనర్ వివరణ ఇచ్చారు. ఎక్కడా ఎలాంటి సేవలకు ఆటంకాలు ఏర్పడలేదని స్పష్టం చేశారు. హైడ్రా అంటే ప్రజల్లో ఎంతో విశ్వాసం, గుర్తింపు ఉందని, అందుకనుగుణంగా అందరూ కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు.సైన్యంలో పని చేసి వచ్చిన వారంతా మార్షల్స్గా ఉన్నారని వారి సేవల పట్ల హైడ్రా పూర్తి విశ్వాసంతో ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. మిగతా రాష్ట్రాల్లో వారికి ఇక్కడి కంటే ఎక్కువ జీతాలు చెల్లిస్తున్నట్టయితే, ఆ విధానాలను కూడా అధ్యయనం చేస్తామన్నారు.

# ఉపాధి కోసం ఉజ్బెకిస్థాన్ వెళ్ళిన చోటే ఆగిన గుండె..



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)ఆగస్టు 11:నిర్మల్ జిల్లా, దస్తూరాబాద్ మండలంలోని మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని, కొత్తపెదూర్ గ్రామానికి చెందిన సంఘ సురేష్ (33) కుటుంబ పోషణ,ఉపాధి నిమిత్తం ఒకే గ్రామనికి చెందిన ఐదు గుర్ని కడెం మండలం లింగాపూర్ గ్రామ సబ్ ఏజెంట్ 2 లక్షల 50 వేల రూపాయలు వీసా రుసుము కింద కట్టించుకొని మొదట 9 రోజులు ఢిల్లీ లో ఉంచి అక్కడి నుండి టూరిస్ట్ వీసా మీద తాష్కెంటు పంపినారు.ఉజ్బెకిస్తాన్ దేశంలో అక్కడ గుజరాత్ కు చెందిన బాహుబల్ వీరిని టూరిస్ట్ హాస్టల్ వద్ద క్లీనింగ్ పని కోసం 15 రోజులు శిక్షణా ఇవ్వడం జరిగింది, అనంతరం డ్యూటీలో చేరగా నాల్గవ రోజు పని చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన గత నెల 21 న సోమవారం అకస్మాత్తుగా వచ్చిన గుండె పోటు వల్ల ఆసుపత్రి తరలిస్తున్న సమయంలో సంగ సురేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కడసారి చూపు కోసం నిరీక్షిస్తున్న సమయంలో అక్కడి ఏజెంట్ మృత దేహాన్ని కార్గో లో పంపడానికి డబ్బు కావాలని ఖర్చు అవుతుందని, ఒక సారి భార్య కు ఫోన్ చేసి డిల్లీ వరకు మాత్రమే పంపుతాను, హైదరాబాద్ ఎయిర్పోర్ట్ వరకు పంపలేము అని అంటూ కాలయాపన చేస్తున్నారు.నేడు భార్య సంగ మమత పిల్లలు, మృతుని మామ జింక భూమన్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలిసి విషయం తెలుపగా తక్షణం స్పందించిన కలెక్టర్ వివరాలు తీసుకొని మృత దేహం త్వరగా ఇండియా పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటి మెంబెర్ స్వదేశ్ పరికిప%శీ%డ్లను కలిసి వినత పత్ర కాపీని యిచ్చి మృత దేహాన్ని త్వరగా ఇండియా రప్పించడమే కాక ఏజెంట్ కు ఇచ్చిన డబ్బును తిరిగి ఇప్పించాలని కోరారు.

# క్షేత్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన శిశుమందిర్ విద్యార్థులు..

కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (భారత శక్తి) [illegible]



లో జరిగిన ప్రాంత స్థాయి (స్టేట్ లెవెల్) క్రీడా పోటీలలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ హై స్కూల్, కరీంనగర్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి అనేక విభాగాలలో విజేతలుగా నిలిచారు. దక్షిణ మధ్య క్షేత్ర స్థాయి పోటీలకు ఎంపికై, కర్ణాటకలో జరగబోయే పోటీలలో పాల్గొనే అర్హత సాధించారు.యోగా అండర్ 17 విభాగంలో కాల్వ సాత్విక, అమ్ముల వనజ, బూధిరెడ్డి స్మైలి శ్రీ, వెల్దండి బాల త్రిపుర సుందరి తమ అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో విజేతలుగా నిలిచారు.యోగా అండర్ 14 విభాగంలో జీల వేదక్షరి, కానవేని శివాని, అడిదెల హర్షిత, మనుపాటి ప్రియ హర్షిణి, ఆదిపెల్లి రిశ్విత తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు.చెస్ అండర్ 14 విభాగంలో యంసాని శ్రీవల్లి, ఎర్ర అభిగ్న, బుర్ర అమృత, మనుపర్తి హనిశ్రీ అసాధారణ మేధస్సును ప్రదర్శించి మెరిసిపోయారు.బాలకుటీర్ వసతి గృహంలో ఉంటూ, శిశు మందిర్ పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థులు క్రమశిక్షణ మరియు క్రీడాస్ఫూర్తితో ఈ విజయాన్ని సాధించినట్లు బాలకుటీర్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల జీవితంలో కేవలం శారీరక దృఢత్వాన్నే కాదు, మానసిక దృఢత, సమయపాలన, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. భవిష్యత్తు కెరీర్‌కి బలమైన పునాది అవుతాయి. జోనల్ లెవెల్‌లో కూడా ప్రతిభ కనబరచేందుకు తగిన అన్ని సదుపాయాలు అందిస్తున్నాము. కృషి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే, క్రీడల ద్వారా దేశ స్థాయిలో కూడా మన పిల్లలు రాణించగలరని పేర్కొన్నారు.విజేతలను డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ళ సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి తదితరులు అభినందించారు.

# ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు దేశ సాంకేతికత ఆధారిత వృద్ధి

హైదరాబాద్, ఆగస్టు 11 ఏడు సంవత్సరాల విరామం తర్వాత, భారతదేశంలో స్టార్టప్‌లు, సృష్టికర్తలు, కలలు కనేవారు, ఆవిష్కర్తలు మరియు అంతరాయం కలిగించేవారి అతిపెద్ద వేడుక అయిన ఆగస్టు ఫెస్ట్, హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గొప్పగా పునరాగమనం జరిగింది.మొదట వ్యవస్థాపకతపై దృష్టి సారించిన ఈ ఉత్సవం ఇప్పుడు టెక్నాలజీపై దృష్టి సారించింది – 2047 నాటికి భారతదేశం వి30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మారాలనే ఆకాంక్షలకు అనుగుణంగా,తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సీఈఓ స్పీడ్ శ్రీ జయేష్ రంజన్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ ఏ.ం. చౌదరి; సంగీత స్వరకర్త మరియు వ్యవస్థాపకుడు రమణ గోగుల; మరియు ఆగస్టు ఫెస్ట్ వ్యవస్థాపకుడు కిరణ్ మావెరిక్ వంటి ప్రముఖులతో కలిసి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ, భారతదేశం మరియు తెలంగాణ వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో పెద్ద ఆలోచనలు మరియు సాంకేతిక అంతరాయం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

## విద్యార్థుల సంక్షేమంవిషయంలో రాజీ పడేది లేదు..



కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (భారత శక్తి):గురుకులాల్లో చదువుతున్న ఎస్సీ, పేద విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదనీ, పేద విద్యార్థుల చదువులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తున్నదని ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం చింతకుంట బాలికల గురుకుల పాఠశాలను మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను పర్యవేక్షించారు. విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, దొడ్డు బియ్యం ఎందుకు పెడుతున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అధికారులు దొడ్డు బియ్యం పంపిణీ చేయడం సరైనది కాదన్నారు. గత 15 రోజులుగా దొడ్డు బియ్యం అన్నం వండుతున్నారని ప్రిన్సిపాల్ మంత్రికి ఫిర్యాదు చేశారు. వెంటనే కరీంనగర్ డి ఎస్ ఓ తో మంత్రి ఫోన్లో మాట్లాడి వివరాలు కనుక్కున్నారు. గురుకులానికి సరఫరా చేసిన దొడ్డు బియ్యం వెంటనే మార్చాలని ఆదేశించారు. పేద విద్యార్థులు చదువుకునే గురుకుల పాఠశాలకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడం ఏంటని డిఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఈ విషయంపై సివిల్ సప్లయిస్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహన్ తో మంత్రి ఫోన్లో మాట్లాడారు. రెండురోజుల్లో ఈ సమస్య పరిష్కారం చేయాలనీ కమిషనర్ కు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లకు దొడ్డు బియ్యం సరఫరా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఇలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గురుకులంలో మెస్ పరిసరాలు మెరుగు పరచాలని, శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. మెస్ వద్ద అదనపు వాటర్ ప్లాంట్ నిర్మించాలని, వారంలో స్టీల్ వంట పాత్రలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు వారం రోజుల్లో స్కూల్ పరిసరాలు కబ్జాకాకుండా ప్రహరీ నిర్మాణానికి , క్యాంపస్లో ఎలెక్ట్రిషియాన్ నియామకానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. పిల్లలకు బాస్కెట్ బాల్ కోర్ట్, మైదానం అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమంలో రాజీ పడేది లేదని, తమ సీఎం, ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు, తమ దృష్టికి తీసుకురావచ్చని మంత్రి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు.

## శ్రీ రామ్ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం..!!



ఎల్బీనగర్, ఆగష్టు 11 (భారత శక్తి):మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో శ్రీరామ్ నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల విషయంలో సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులోకి వచ్చేలా ప్రక్రియ మొదలైందన్నారు. ముఖ్యంగా చాలా కాలనీలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తికావొస్తుందని, వాటిలో అదనంగా ఇంకొక ఫ్లోర్ అడుగుతున్నారని అవి కూడా తొందరలో పూర్తవుతాయని, పిల్లలకు ముఖ్యంగా ఆడుకునే క్రీడాప్రాంగణం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్,జక్కిడి రఘు వీర్ రెడ్డి, టంగుటూరి నాగరాజు, రుద్ర యాదగిరి, నర్రి వెంకన్న, సంతోష్, కాంచర్ల రాకేష్ రెడ్డి, ఉంద్రాతి రవి, సతీష్, త్రిలోక్ గౌడ్, శివశంకర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, సీనియర్ నాయకులు, నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలి..





కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 11 (భారత శక్తి):ఈనెల 14వ తేదీన కరీంనగర్ లో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ కథనబేరి సభ స్థలమైన మహాత్మా జ్యోతిభాపులే మైదానాన్ని సోమవారం మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి తలసాని తో కలసి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను ఎండగుతామని హెచ్చరించారు,ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు విసిగి పోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు రామకృష్ణారావు ,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ , మాజీ కౌన్సిల్ చైర్మన్ స్వామి గౌడ్ , మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ , ఎమ్మెల్సీ ఎల్ రమణ , మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ , మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, వసంత , మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ రావు , మాజీ ఎమ్మెల్యే లు రసమయి బాలకిషన్ , సుంకె రవిశంకర్ , దాసరి మనోహర్ రెడ్డి , వొడితెల సతీష్ బాబు , విద్యాసాగర్ రావు , కోరుకంటి చందర్ ,నాయకులు బండ శ్రీనివాస్ , ప్రవీణ్ కుమార్ ,సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాయకులు చల్లా హరిశంకర్ , పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కాసరపు శ్రీనివాస్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు .

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల..



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)ఆగస్టు 11:నిర్మల్ జిల్లా,సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి,వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ, వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయుడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి,చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.

తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ, ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి-కలెక్టర్ పమేలా సత్పతి..





కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 11 (భారత శక్తి):సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ..1 నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. విద్యార్థులు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని,,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి, జిల్లా అధికారులతో కలిసి పాఠశాలకు చెందిన బాల,బాలికలకు నులి పురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 01-19 వయస్సు కలిగిన బాల,బాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడిలలో పిల్లలకు ఈ మాత్రలు వేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలనీ, విద్య, వైద్యారోగ్య శాఖల అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల ఎవరైనా తప్పిపోతే, మలి విడతగా చేపట్టే కార్యక్రమంలో తప్పనిసరిగా వారికి ఆల్బెండజోల్ మాత్ర వేసేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం నూటికి నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యా శాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నులి పురుగుల వల్ల పిల్లల ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో రెండు పర్యాయాలు, నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని తెలిపారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

కాగా, విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, ఆహార పదార్థాలు తినే ముందు చేతులను చక్కగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అపరిశుభ్రంగా ఉండడం వల్ల అనారోగ్యాలు దరిచేరుతాయని, దీంతో చదువుపై ఆసక్తి ఉండదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.. విద్యార్థులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, భోజనం చేసే ముందు కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పండ్లు కూరగాయలు కోసేముందు నీటితో శుభ్రంగా కడగాలని విద్యార్థులు తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఇతర వైద్య అధికారులు సిబ్బంది పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు దేశ సాంకేతికత ఆధారిత వృద్ధి

హైదరాబాద్, ఆగస్టు 11

ఏడు సంవత్సరాల విరామం తర్వాత, భారతదేశంలో స్టార్టప్‌లు, సృష్టికర్తలు, కలలు కనేవారు, ఆవిష్కర్తలు మరియు అంతరాయం కలిగించేవారి అతిపెద్ద వేడుక అయిన ఆగస్టు ఫెస్ట్, హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గొప్పగా పునరాగమనం జరిగింది.మొదట వ్యవస్థాపకతపై దృష్టి సారించిన ఈ ఉత్సవం ఇప్పుడు టెక్నాలజీపై దృష్టి సారించింది - 2047 నాటికి భారతదేశం వి30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మారాలనే ఆకాంక్షలకు అనుగుణంగా,తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సీఈఓ స్పీడ్ శ్రీ జయేష్ రంజన్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ ఏ.ం. చౌదరి; సంగీత స్వరకర్త మరియు వ్యవస్థాపకుడు రమణ గోగుల; మరియు ఆగస్టు ఫెస్ట్ వ్యవస్థాపకుడు కిరణ్ మావెరిక్ వంటి ప్రముఖులతో కలిసి ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ, భారతదేశం మరియు తెలంగాణ వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో పెద్ద ఆలోచనలు మరియు సాంకేతిక అంతరాయం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 2035 నాటికి రాష్ట్ర ఉఆఖని వి1 ట్రిలియన్‌కు మరియు 2047 నాటికి వి3 ట్రిలియన్‌కు పెంచడం, జాతీయ ఉఆఖకి దాని సహకారాన్ని 5% నుండి 10%కి పెంచడం లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీని ఆయన హైలైట్ చేశారు."ఆవిష్కర్తలు, కలలు కనేవారు మరియు నూతన పోకడను ప్రవేశపెట్టేవారు మన ఆర్థిక వ్యవస్థకు పోస్టర్ బాయ్స్" అని ఆయన అన్నారు, ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు రాష్ట్రం మరియు దేశంలో సాంకేతికత ఆధారిత వృద్ధి భవిష్యత్తును రూపొందించడంలో కీలకమైనవని అన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..






కరీంనగర్ ప్రతినిధి,ఆగస్టు 11 (భారత శక్తి):స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను,పండుగ వాతావరణంలో, అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో పంద్రాగస్టు వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేయాలని, వర్షాలు కురుస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య బృందాన్ని,108 అంబులెన్స్ ను వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవం..



కామారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) ఆగస్టు 11: నులిపురుగుల నివారణకు 1 నుండి 19 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో,నులిపురుగుల నివారణ దినోత్సవం 2025 సంవత్సరంకు కామారెడ్డి జిల్లాలో అన్ని పాఠశాలలలో, అంగన్వాడీ పాఠశాలలలో, ఇంటర్మీడియట్ కళాశాలలో ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) లను వేశారు. ఇట్టి నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కామారెడ్డి పట్టణ కేంద్రంలోని దేవునిపల్లిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు ఆల్బుండజోల్ మాత్రలు వేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరూ నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకుని నులిపురుగుల వల్ల సంభవించు రక్తహీనత, ఆకలిలేమి, మానసిక, ఆరోగ్య పరంగా ఎదుగుదల వంటి వ్యాధుల నుండి దూరంగా ఉండి విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఇట్టి కార్యక్రమాన్ని ఒకటి నుంచి 19 సంవత్సరాలు గల పిల్లలందరూ ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు, నులి పురుగుల నివారణ మాత్రలు వేయించుకొని వారు ఈ నెల ఆగస్టు 18 వ తారీఖున వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి చంద్రశేఖర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, రాజు జిల్లా విద్యా శాఖ అధికారి, ప్రభు కిరణ్ డిప్యూటీ డిఎంహెచ్ఓ,డాక్టర్ విద్యా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి , మండల విద్యాశాఖ అధికారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిస్తే నరకయాతన..

**వర్షం కురిస్తే నీట మునిగిన కాలనీలు, వరద నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు, జలమయమైన అనేక ప్రాంతాలు, ఎటు చూసినా ఎత్తైన ఆకాశ హర్మ్యాలతో కాంక్రీట్ జంగిల్ ని తలపించే కట్టడాలు, కట్టలు తెగి మురికి నీరుతో పొంగి ప్రవహిస్తున్న చెరువులు.. ఇదీ నేటి హైదరాబాద్ మహానగర పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మార్పు సంభవమేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.. రోజు రోజుకూ పెరిగిపోతున్న జనాభా.. నివాసయోగ్యం లేని దౌర్భాగ్యం.. మురికివాడల్లో జీవనం వెల్లబోస్తున్న దారుణం.. నాలాల ఆక్రమణ.. ఆకాశ హర్మ్యాల నిర్మాణం.. విధి విధానాలు పాటించని నిర్మాణదారులు.. లంచాలకు దాసోహం అంటున్న ప్రభుత్వ అధికారులు.. స్వార్ధ ప్రయోజనాలకోసం వెంపర్లాడుతున్న రాజకీయ నాయకులు.. ప్రభుత్వాలు.. వెరసి నగర జీవితం అస్తవ్యస్తం అవుతోంది.. ప్రతి క్షణం నరకంగా మారుతోంది..**

హైదరాబాద్, ఆగష్టు 11 (భారత శక్తి) : 400 సంవత్సరాల సుదీర్ఘ సాంస్కృతిక చరిత్ర కలిగి దేశంలోనే రెండవ అతి పెద్ద మెట్రోపాలిటన్ నగరంగా అవతరించిన హైదరాబాద్ 1990వ దశకంలో వచ్చిన ఐటి విప్లవం కారణంగా ఐటి కారిడార్ గా పేరు పొందింది. 16 వ శతాబ్దంలో 3.5 చదరపు కిలోమీటర్ల ఉన్న నగర విస్తీర్ణం 7228 చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి విస్తరించి, ఒకప్పుడు చెప్పిన జనాభా లెక్కల ప్రకారం లక్షల్లో ఉన్న నగర జనాభా నేడు కోట్లకు చేరింది. ఇది 2030 నాటికి ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన 28 మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఒకటిగా నిలుస్తుందని అంచనా. సాధారణంగా జులై నుంచి సెప్టెంబరు మధ్యలో హైద్రాబాదులో 80 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అవుతుంది. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటలలో సగటున 5.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని లెక్కలు చెబుతున్నాయి..వాతావరణ నివేదిక చెబుతోంది. హైదరాబాద్ నగరంలో ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా భారీ వర్షాలు కురిసినప్పుడు పలు ప్రాంతాలలో భారీగా నీరు ఇళ్లలోకి రావడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. దేశంలోనే రెండవ పెద్ద మెట్రోపాలిటన్ నగరంగా చెప్పుకునే హైదరాబాద్ నగరంలో వర్షాలు కురిసిన ప్రతి సారీ ఇటువంటి పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది? దీనికి కేవలం అధిక వర్షపాతమే కారణమా? అధిక స్థాయిలో వర్షాలు కురవడం వలన మాత్రమే నగరాన్ని భారీ స్థాయిలో వరదలు ముంచెత్తాయని చెప్పలేమని నిపుణులు అంటున్నారు.

"హైదరాబాద్ నగరంలో వరదలు రావడం ఇది మొదటి సారి కాదు ఓల్డ్ సిటీలో చాలా ప్రాంతాలలో ఇప్పటికీ పురాతనమైన డ్రైనేజీ విధానమే కొనసాగుతోంది. అప్పట్లో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ పూర్తి స్థాయిలో పునరుద్ధరణ జరగకపోవడం కూడా ఈ వరదలకు ఒక కారణం" అని విశ్లేషకులు చెబుతున్నారు.. 1956లో హైదరాబాద్ రాజధానిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ప్రారంభమైనప్పటి నుంచి ఈ నగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. 2041 నాటికి నగర జనాభా ఒక కోటి 20 లక్షలకు చేరుతుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లోనే అంచనా వేసింది. "అయితే, జనాభా పెరుగుదలకు తగిన రీతిలో మౌలిక సదుపాయాల కల్పన మాత్రం జరగలేదు అన్నది వాస్తవం.. అంటారు. కాగా 1908లో హైదరాబాద్ నగరానికి భారీ వరదలు వచ్చి నగరం మునిగినప్పుడు వరదలను నివారించేందుకు అవసరమైన ప్రణాళికలను సూచించాల్సిందిగా మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నిజాం కోరారు.మూసీతోపాటు దాని ఉపనదిగా ఉండే ఈసీ పై కొన్ని జలాశయాలను నిర్మించాలని ప్రతిపాదిస్తూ విశ్వేశ్వరయ్య ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. మురుగునీటి పారుదలకు అవసరమైన సూచనలు చేశారు. అప్పుడు నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థే ఇప్పటికీ చాలా పటిష్టంగా ఉంది.. కాకపోతే, దీనిని పూర్తిగా పునరుద్ధరించడం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాని పని అన్నది మేధావులు అంటున్నారు.. హైదరాబాదు జనాభాలో 25 శాతం మంది మురికి వాడల్లోనే నివసిస్తున్నారని పరిశోధకులు తెలియజేశారు.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా మూసీ నది ఒడ్డున నివసిస్తున్న ప్రాంతాల వైపు దృష్టి సారించలేదని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.. ఈ పరిస్థితికి అద్దం పడుతూ ప్రస్తుతం హైదరాబాద్ ఓల్డ్ సిటీలో పలు ప్రాంతాలు జల దిగ్బంధమై చాలా నష్టానికి గురయ్యాయి. హైదరాబాద్ మౌలిక సదుపాయాల కల్పన కోసం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ 5,380 కోట్ల రూపాయిలు కేటాయించగా అందులో 490 కోట్ల రూపాయిలు కేవలం డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, పునరుద్ధరణ



కోసమే కేటాయించడం జరిగింది.. కాగా కరోనా కారణంగా ఈ పనులు ముందుకు సాగి ఉండకపోవచ్చని అభిప్రాయం వెల్లడవుతోంది.. అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే హైదరాబాద్ లో ఒకప్పుడు 2000 చెరువులు ఉండేవని నేడు 200 కూడా కనిపించటం లేదు. చెరువులను, బావులను పూడ్చి చేపడుతున్న నిర్మాణాలు చేపట్టడం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణమని చెప్పక తప్పదు.. దీనికితోడు 80 అడుగుల కాల్వలు, 8 అడుగులకు చేరిపోతే వ్యర్థాలు బయటకు ఎలా వెళతాయి అన్నది ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్న.. హైదరాబాద్ నగరానికి 5,000 కిలోమీటర్ల నాలాలు, కాలువలు అవసరమైతే, ప్రస్తుతం కేవలం 1500 కిలోమీటర్ల మేర మాత్రమే నాలాలు ఉన్నాయని నిపుణుల అంచనా.. 4,00,000 డ్రైనేజీ గుంతలు ఉండాల్సిన చోట కేవలం 2,00,000 డ్రైనేజీ గుంతలు మాత్రమే ఉన్నాయి అన్నది కూడా వారి అంచనా.. ఇక ఎవరైనా ఇల్లు కొనుక్కుంటున్నప్పుడు దానికి తగిన చట్టపరమైన ఆమోదాలు ఉన్నాయా లేదా? వర్షపు నీరు నిల్వ చేసేందుకు తగిన ఇంకుడు గుంతలు ఉన్నాయా లేదా లాంటి అంశాలన్నీ పరిశీలనలోకి తీసుకోవాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.. అదే విధంగా గృహ నిర్మాణాలకు ఆమోదం తెలిపే ముందు అధికారులు ముందు చూపుతో వ్యవహరించాలని.. అలాగే ప్రజలు కూడా అత్యాశకు పోకుండా ఆ ప్రాంత భౌగోళిక స్వరూపం అర్థం చేసుకుని గృహ నిర్మాణం చేసుకుంటే భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కొనే పరిస్థితి రాకపోవచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.. వాటర్ జోన్ల గురించి, గృహ నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఖచ్చితంగా ఉంటుంది.. అవగాహన కల్పించడానికి చాలా మంది ఉన్నారు కానీ, నిజానికి ఇప్పుడు కావల్సింది క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన వ్యక్తులు అన్నది నిర్వివాదాంశం.. ప్రతి ఒక్కరు వర్షపు నీరు నిల్వ ఉంచేందుకు తగిన ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించాలి. చెరువులను, బావులను పునరుద్ధరించాలి. ఇటీవల హైటెక్ సిటీలో పునరుద్ధరించిన ఒక బావి ఈ వర్షాల సమయంలో 4 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేయగలిగింది ఎంతమందికి తెలుసు..? గతంలో ఆ బావి ఒక డంపింగ్ యార్డ్ గా ఉండేది. వర్షపు నీరు నిల్వ ఉండే కేంద్రాలు పెరగడం ద్వారా ఇలాంటి వరదలను తప్పకుండా నివారించవచ్చు.. పబ్లిక్ ప్రైవేట్ సహకారంతో భూగర్భ జలాల సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలను తక్షణమే మొదలుపెట్టాలని మేధావులు సూచిస్తున్నారు.. హైడ్రా ఈ దిశగా ఆలోచించాల్సి వుంది.. లేకపోతే ఇలాంటి వైపరీత్యాలు ఎదుర్కోక తప్పదు.. ఇది అందరూ గ్రహించాలి.. ముఖ్యంగా చెరువులను వ్యర్థాలతో నింపడం ఆపాలి.. ఇందుకోసం ప్రజలు, ప్రభుత్వాలు సంసిద్ధం కావాలి.. ఒక్క విషయం మాతం వాస్తవం "భూ వినియోగ పద్దతులలో మార్పులు వస్తేనే కానీ, పరిస్థితులు మారవు".. "ప్లకార్డులు పట్టుకుని వాతావరణ మార్పులు కావాలంటే రావు.. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ పని పనిచేయాలి.. ఏ ఒక్కరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడటానికి వీలు లేదు.. నీటి సంరక్షణ పట్ల సానుకూలంగా లేకపోయినా కనీసం తటస్థంగానైనా ఉండవలసిన అవసరం ఉంది. చేయి చేయి కలిస్తే చేయలేని మార్పు ఏమి ఉండదు" అని " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " పిలుపునిస్తోంది..

## రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పరిధిలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారంటూ రేవంత్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ పిటిషన్ పై ధర్మాసనం పలుమార్లు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## అసిమ్ మునీర్ అణు వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన..

**ఢిల్లీ, ఆగష్టు 11 (భారత శక్తి) :** అమెరికా గడ్డపై నుంచి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేసిన అణు బెదిరింపులపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి అణు ప్రగల్భాలు పలకడం పాకిస్థాన్‌కు పరిపాటి అని, మిత్ర దేశం భూభాగం నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం విచారకరమని సోమవారం భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని టంపా నగరంలో పాకిస్థానీ సంతతి ప్రజలతో జరిగిన ఒక సమావేశంలో అసిమ్ మునీర్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. భవిష్యత్తులో భారత్‌తో యుద్ధం జరిగి, తమ దేశ మనుగడకే ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. "మేము అణ్వస్త్ర దేశం. మేం మునిగిపోతున్నామని అనిపిస్తే, మాతో పాటు సగం ప్రపంచాన్ని తీసుకుపోతాం" అని మునీర్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. "ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యల విషయంలో అంతర్జాతీయ సమాజం తన సొంత నిర్ధారణకు రాగలదు. మరోవైపు, పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఒక బాధ్యతారహిత దేశమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా మద్దతు లభించినప్పుడల్లా పాకిస్థాన్ సైన్యం తన అసలు స్వరూపాన్ని బయటపెడుతుందని, ఇది ఎప్పటినుంచో జరుగుతున్నదేనని వ్యాఖ్యానించాయి. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం లేదని, అంతా సైన్యం నియంత్రణలోనే ఉందని ఈ వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని, ఆ దేశంలోని అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే నిజమైన ప్రమాదం ఉందని ఆ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్..

**అమరావతి, ఆగష్టు 11 (భారత శక్తి) :** ఏపీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, వాటిని రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మార్చాలని ఆయన సూచించారు. సోమవారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రవాణా, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసేందుకు ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పోర్టులు, విమానాశ్రయాలు, రహదారులను అనుసంధానిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. దీని ద్వారా లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించి, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపరిచేందుకు, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా పీపీపీ పద్ధతిలో రహదారుల విస్తరణ చేపట్టాలని అధికారులకు తెలిపారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా, కొన్ని ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం కోరారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులతో పాటు, జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల తొలి దశ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## కొండా సురేఖ.. ఇంటి ముందు ఉద్రిక్తత

**హైదరాబాద్, ఆగష్టు 11 (భారత శక్తి) :** హన్మకొండలోని మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ వారు నిరసనకు దిగారు. అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన పథకాన్ని కేటాయించే ప్రతిపాదనను విరమించుకోవాలని నినాదాలు చేశారు. ఈ నిర్ణయం కారణంగా మధ్యాహ్న భోజన పథకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి తీరని నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే 8 నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సురేఖ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకుని, చెదరగొట్టారు.

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు: షర్మిల

**అమరావతి, ఆగష్టు 11 (భారత శక్తి) :** బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా 'ఓట్ చోర్ క్యాంపెయిన్'ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఏపీలో సైతం ఈ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేరుస్తామని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఓట్ల దొంగ మోదీ తీరును, బీజేపీ కోసం అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగడతామని చెప్పారు. ప్రజాస్వామ్యమే ఈసీకి ముఖ్యమని భావిస్తే... రాహుల్ గాంధీ లేవనెత్తిన సందేహాలకు బదులివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని షర్మిల ప్రశ్నించారు. డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి ఎన్నికల సంఘం ఏజెంట్ గా మారిందా? అని నిలదీశారు. దొడ్డిదారిలో గెలుపు కోసం ఎన్నికల కమిషన్ నే బీజేపీ కలుషితం చేసిందని షర్మిల మండిపడ్డారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఆర్ఎస్ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో చేరిందని విమర్శించారు. మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉంటున్నారని అన్నారు.

## పార్లమెంటు నుంచి ఈసీ కార్యాలయం వరకు.. 300 మంది ప్రతిపక్ష ఎంపీల మార్చ్!

**ఢిల్లీ, ఆగష్టు 11 (భారత శక్తి) :** 25 ప్రతిపక్ష పార్టీలకు చెందిన 300 మందికి పైగా ఎంపీలు నేడు పార్లమెంట్ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో జరిగినట్టు ఆరోపిస్తున్న 'ఓట్ చోరీ' (ఓట్ల దొంగతనం), ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై నిరసన తెలియజేయడమే ఈ మార్చ్ ప్రధాన ఉద్దేశం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, డీఎంకే, ఆప్, వామపక్షాలు, ఆర్జేడీ, ఎన్సీపీ(ఎస్పీ), శివసేన (యూబీటీ), నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పలు పార్టీలు ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం 11:30 గంటలకు పార్లమెంట్ మకర్ ద్వార్ నుంచి ఈ మార్చ్ ప్రారంభమవుతుంది. అయితే, ఈ మార్చ్‌కు సంబంధించి అనుమతి కోరుతూ తమకు ఎలాంటి అభ్యర్థన రాలేదని పోలీసులు తెలిపారు. ఈ నిరసనకు ఇండియా కూటమి పిలుపునిచ్చినప్పటికీ బ్యానర్లు లేకుండానే మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిపక్ష కూటమి నుంచి 'ఆప్' బయటకు వచ్చినప్పటికీ ఈ మార్చ్‌లో అది కూడా పాల్గొనే అవకాశం ఉంది. కాగా, ఎన్నికల సంఘం పారదర్శకంగా ఉండాలని, డిజిటల్ ఓటర్ జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు.

## టాలీవుడ్‌లో ఆగిన సినిమా షూటింగులు..

**హైదరాబాద్, ఆగష్టు 11 (భారత శక్తి) :** తెలుగు చిత్ర పరిశ్రమలో కార్మికుల వేతనాల పెంపు వివాదం తీవ్రరూపం దాల్చింది. షూటింగులు నిలిచిపోవడంతో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుంది. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ విషయంపై దృష్టి సారించి, నిర్మాతల ప్రతినిధులతో చర్చలు జరిపారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 30 శాతం వేతనాల పెంపు డిమాండ్‌తో సమ్మెకు దిగడంతో గత కొన్ని రోజులుగా సినిమా చిత్రీకరణలు పూర్తిగా ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, ప్రముఖ నిర్మాత జెమిని కిరణ్, సుప్రియ, రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి రవి గుప్తా తదితరులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. సమ్మెకు దారితీసిన పరిస్థితులను, పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు మంత్రికి వివరించారు. కార్మికుల జీవన వ్యయాన్ని అర్థం చేసుకున్నామని, అయితే చర్చల ద్వారా సహేతుకమైన పరిష్కారం కనుగొనాలని మంత్రి సూచించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.